


మల్లంపాడు చెరువు సమీప భూముల వద్ద
రైతుల ఘర్షణ
» భూమి తమదంటే తమదని కర్రలతో పరస్పర దాడులు
» ఐదుగురికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
» ఓసీ ప్రభావిత భూముల నష్టపరిహారం కోసం ఘర్షణలు
7



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

» మున్నేరు రిటైనింగ్ వాల్‌ను వచ్చే జూన్ నాటికి పూర్తిచేయాలి
» తీగల వంతెన పనులూ మరింత ముమ్మరం కావాలి
» ఖమ్మం ఖిల్లా రోప్‌వేను త్వరితగతిన చేపట్టాలి
» అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల ఆదేశాలు

ఖమ్మం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : అభివృద్ధి పనుల్లో వేగం పెంచి నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డితో కలిసి మున్నేరు రిటైనింగ్‌వాల్, కేబుల్‌బ్రిడ్జి, ఖిల్లారోప్‌వే పనులపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ మున్నేరు వరదలనుంచి నగర వాసులకు ఇబ్బంది కలగకుండా ఇరువైపులా చేపట్టిన రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనులను మరింత వేగంగా చేయాలని, వచ్చే జూన్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. రూ.690కోట్లతో మున్నేరుకు ఇరువైపులా 17కి.మీ. మేర రిటైనింగ్‌వాల్ నిర్మాణం జరుగుతుందని, ఇప్పటి వరకు 6.4కి.మీ. మాత్రమే పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులకు భూసేకరణ వెంటనే చేపట్టాలన్నారు. ఇక మున్నేరుపై జరుగుతున్న కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని, రూ.180కోట్లతో చేపట్టిన ఈ పనులు ఇప్పటి వరకు 53శాతం పూర్తయ్యాయని, ఒప్పందం ప్రకారం వచ్చే మార్చిలో పనులు పూర్తికావాల్సి ఉందన్నారు. వర్షాలతో జాప్యమైనందున మే నెలాఖరుకు పూర్తవుతుందని తుమ్మల తెలిపారు. పర్యాటకుల సౌకర్యార్థం ఖమ్మం ఖిల్లాపై నిర్మిస్తున్న రోప్‌వేకు భూసేకరణ పూర్తయిందని, రూ.29కోట్లతో చేపడుతున్న రోప్‌వే సివిల్ పనులను నెలాఖరులోపు ప్రారంభించి వచ్చే జూలై నాటికి అగ్రిమెంట్ ప్రకారం మొత్తం పనులు పూర్తిచేయాలని తెలిపారు. ఖిల్లాపై చేపట్టాల్సిన పనులపై ప్రణాళిక రూపొందించాలని, ఖిల్లాకు రోడ్ కనెక్టివిటీకి రోడ్ల విస్తరణ చేపట్టాలన్నారు. ఖమ్మం నగరం చుట్టూ జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతుందని, ఖమ్మం-దేవరపల్లి జాతీయరహదారిపై ధంసలాపురం వద్ద రైల్వే ఓవర్‌బ్రిడ్జి, (మిగతా 6వ పేజీలో)

ఉద్యోగులకే దక్కిన రాజీవ్ స్వగృహ



రూ.87.41కోట్లకు జలజ ప్రాజెక్టును సొంతం చేసుకున్న టీజీవో హౌస్‌బిల్డింగ్ సొసైటీ

ఖమ్మం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): దశాబ్దంన్నర కాలానికిపైగా అసంపూర్తిగా.. నిరుపయోగంగా ఉన్న ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలోని రాజీవ్ స్వగృహ జలజ ప్రాజెక్టు ఉద్యోగులకే దక్కింది. ఈ భవనాల విక్రయానికి సోమవారం టెండర్ల ప్రక్రియ నిర్వహించగా.. రూ.87.41కోట్లకు టీజీవో హౌస్‌బిల్డింగ్ సొసైటీ దక్కించుకుంది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల కోసం రాజీవ్ స్వగృహ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో అపార్టుమెంట్లు నిర్మించారు. ఈ క్రమంలోనే ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి సమీపంలోని 9.5 ఎకరాల్లో 8టవర్లుగా నిర్మాణం చేపట్టారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించిన తర్వాత కొంతకాలం నత్తనడకన సాగిన ఈ అపార్టుమెంట్ల నిర్మాణ పనులను



బాణసంచా కాలుస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

రాష్ట్ర విభజన అనంతరం పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. టెండర్లకు వెళ్లినా ఎవరు తీసుకునేందుకు ముందుకు రాలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజీవ్ స్వగృహ ఎండీ వీపీ గౌతమ్‌లను కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులు అసంపూర్తిగా ఉన్న రాజీవ్ స్వగృహఫ్లాట్లను తమకు కేటాయిస్తే పూర్తిచేసి అధికారులు, ఉద్యోగులకు కేటాయిస్తామని చెప్పారు. దీంతో ప్రభుత్వం గతంలో అయిన ఖర్చులు, ప్రస్తుతం ఇళ్ల పరిస్థితిని అంచనా వేసి స్క్వేర్‌ఫీట్ రూ.1150 ధరగా నిర్ణయించారు. 9.5ఎకరాల్లో 576 ఫ్లాట్లు, 8 బ్లాకులు, 9 అంతస్తులుగా నిర్మించిన వాటిని ప్రభుత్వం టెండర్ల ద్వారా విక్రయించేందుకు నిర్ణయించింది. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ద్వారా నోటిఫికేషన్ విడుదల చేశారు. రాజీవ్‌స్వగృహ కార్పొరేషన్ జలజ టౌన్‌షిప్‌ను రూ.87.41కోట్లుగా నిర్ణయించారు. ఇందులో డబుల్ బెడ్‌రూంతో పాటు మాస్టర్‌బెడ్‌రూం కలిపి 288, ట్రిబుల్‌బెడ్‌రూం 288 ఫ్లాట్లు ఉన్నాయి. దీనికి టీజీవో హౌజింగ్ బిల్డింగ్ సొసైటీ ముందుకు రావడంతో రూ.5కోట్లు ఈఎండీ చెల్లించారు. కాగా కొంతమంది ప్రైవేటు బిల్డర్లు కూడా ఈరాజీవ్ స్వగృహను దక్కించుకుని వ్యాపారపరంగా విక్రయించేందుకు టెండరులో పాల్గొన్నారు. అయితే ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఇది నిర్మించి ఉండడం, ప్రభుత్వ ఉద్యోగులు నిర్ణయించుకున్న ధర తక్కువగా ఉండడంతో ప్రైవేటు వ్యక్తులు తమ టెండరును ఉపసంహరించుకున్నారు. టెండర్ల ప్రక్రియలో టీజీవో హౌజింగ్ బిల్డింగ్ సొసైటీకి రూ.87.41కోట్లకు ప్రాజెక్టును కేటాయించినట్టు రాజీవ్ స్వగృహ ఎండీ వీపీ గౌతమ్ తెలిపారు. కాగా అసంపూర్తిగాఉన్న రాజీవ్ స్వగృహ ప్రాజెక్టును దక్కించుకోవడంతో ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో త్వరితగతిన ఫ్లాట్లను పూర్తిచేసి ఉద్యోగులకు కేటాయించనున్నట్టు టీజీవో బిల్డింగ్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు కట్టా కిషోర్, డాక్టర్ విజయ్‌కుమార్, టీజీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, వేలాద్రి, టీఎస్‌జీవో (మిగతా 6వ పేజీలో)

రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల పంపిణీ

జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో సన్న, చిన్న కారు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50 శాతం, ఇతర పెద్ద రైతులకు 40శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందించనున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంకింద స్ప్రేయర్లు (పవర్, హ్యాండ్, బ్యాటరీ పవర్), రోటావేటర్స్ సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్స్, కల్టివేటర్స్, బండ్ ఫార్మర్స్, బ్రష్ కట్టర్, పవర్ టిల్లర్స్, గడ్డి కట్టలు కట్టే యంత్రాలను రైతులకు సబ్సిడీపై అందచేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాకు ఈ ఏడాదికి వ్యవసాయ యాంత్రీకరణ కింద రూ.4 .37కోట్లు కేటాయించినట్టు లక్షలోపు విలువైన పరికరాలపై సంబంధిత వ్యవసాయ సహాయ సంచాలకులు పరిధిలో, రూ.లక్షపైబడి విలువైన పనిముట్లపై కలెక్టర్ ఆధ్వర్యంలో అనుమతులు ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద లబ్ధి కోసం సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను, మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆ ప్రకటనలో సూచించారు.



ఆ కాలనీలపై పట్టింపేదీ?

» సత్తుపల్లి మునిసిపాలిటీకి ఆదాయం రాని వైనం
» ఏళ్లు గడుస్తున్నా ఇళ్లకు నెంబర్లు లేవు.. పన్ను లేదు
» సింగరేణి ఉద్యోగుల క్వార్టర్లు, పునరావాస కాలనీల పరిస్థితిదీ
» పునరావాస కాలనీకి నేటికీ రాని లేఅవుట్ అనుమతి



కొమ్మేపల్లి పునరావాస కాలనీ

సత్తుపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అది సింగరేణి ఉద్యోగుల కోసం క్వార్టర్లు నిర్మించిన ప్రాంతం. అలాగే కొమ్మేపల్లి నిర్వాసితులకు పునరావాసం కింద కేటాయించిన స్థలాల్లో ఇళ్లు కట్టుకున్న కాలనీ. ఈ కాలనీలపై పట్టింపులేకపోవడంతో అవి సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో ఉన్నా మునిసిపాలిటీకి ఇంటి పన్ను రూపంలో ఆదాయం రాని పరిస్థితి. అలాగే అక్కడి ఇళ్లకు నెంబర్లు కూడా కేటాయించలేదు. అదే సత్తుపల్లి మండలం కొమ్మేపల్లి గ్రామంలోని జేవీఆర్-2 ఓపెన్ కాస్ట్ పునరావాస కాలనీ. సత్తుపల్లిలో ఉన్న సింగరేణి ఓపెన్ కాస్టు బొగ్గు గనుల్లో పని చేస్తున్న ఉద్యోగుల కోసం ఇక్కడ క్వార్టర్లను నిర్మించారు. వీటి నిర్మాణం పూర్తయి ఉద్యోగులు క్వార్టర్లలో నివాసం ఉంటున్నారు. జీ ప్లస్ 1 పద్ధతిలో మొత్తం 352 ఇళ్లున్నాయి. పన్ను మునిసిపాలిటీ అధికారులు నిర్ణయించినా తమకు 50 శాతం పన్నులో రాయితీ ఉంటుందని సంస్థ ఉద్యోగులు వాదిస్తున్నారు. దీంతో ఇంటి పన్ను తుది నిర్ణయం కాకపోవటంతో వసూళ్లు నిలిచిపోయాయి.

పునరావాస కాలనీ

సత్తుపల్లి మండలం కొమ్మేపల్లి గ్రామం జేవీఆర్-2 ఓపెన్ కాస్టు కారణంగా కనుమరుగైంది. ఆ గ్రామం మొత్తం ఖాళీ చేయాల్సి రావటంతో నిర్వాసితులకు సత్తుపల్లి పట్టణంలో భూమి కొనుగోలు చేసి 229 మందికి స్థలాలు కేటాయించారు. వీటిలో నిర్వాసితులు ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. వీటికి ఇంటి పన్ను వేసి వసూలు చేయాల్సి ఉంది. కానీ ఈ ప్రక్రియ ఐదేళ్లుగా పూర్తి కాలేదు. ఇంటి నెంబర్లు కూడా కేటాయించలేదు. దీంతో మునిసిపాలిటీకి పన్ను రూపంలో ఆదాయం రావటం లేదు. అంతే కాక ఇంటి నెంబర్లు కేటాయించకపోవడంతో కొమ్మేపల్లి నిర్వాసితులకు మునిసిపాలిటీ పరిధిలో ఓటు హక్కు కూడా దక్కలేదు. కిష్టారం గ్రామ పంచాయతీలోనే వారి ఓట్లు కొనసాగుతున్నాయి. ఇక్కడ నివసించే వారికి అవసరమైన జనన, మరణ ఇతర ధ్రువీకరణ పత్రాలు కూడా రాని పరిస్థితి ఉంది.

లే అవుట్ అప్రూవల్ కూడా లేదు..

పునరావాస కాలనీ సత్తుపల్లిలో నిర్మించాలని స్థల సేకరణ చేసి ప్లాట్లు చేశారు. ఇక్కడ సిమెంటు రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించారు. కానీ టౌన్‌ప్లానింగ్ నుంచి మాత్రం లే అవుట్ ఇంత వరకూ అనుమతి రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. లే అవుట్ అనుమతికి సంబంధించి ఉన్న సందేహాలను నివృత్తి చేసుకునే క్రమంలో ఫైల్ హైదరాబాద్-సత్తుపల్లి మధ్య చక్కర్లు కొడుతున్నట్లు తెలిసింది. సాధారణంగా ప్రైవేటు వ్యక్తులు కొంత విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించాలంటే లే అవుట్ అనుమతులు తప్పని సరి కానీ పునరావాస కాలనీకి మాత్రం లేఅవుట్ అప్రూవల్ అయిదేళ్లకు పైగా సమయం పట్టటం విశేషం.

త్వరలో ఇంటి పన్ను నిర్ధారిస్తాం: కమిషనర్ నరసింహ

సింగరేణి క్వార్టర్లకు సంబంధించి ఇంటి పన్నులో రాయితీ ఉంటుందంటూ కొన్ని జీవోలు పంపారు. దీనిపై మునిసిపల్ ఉన్నతాధికారులకు లేఖ రాశాం. స్పష్టత రాగానే ఇంటి పన్ను విధిస్తాం. కొమ్మేపల్లి కాలనీలో కూడా త్వరలో ఇళ్ల స్థలాలు, ఇళ్లు కొలతలు తీసుకొని పన్ను విధిస్తాం.



ప్రధాన ఆలయం తలుపులు తెరుస్తున్న దృశ్యం

చంద్రగ్రహణం అనంతరం..
తెరుచుకున్న రామాలయం

» ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు
» సంప్రదాయబద్ధంగా నిత్య కల్యాణం నిర్వహణ

వివరాలు : 7లో



యూరియా కోసం
రైతుల పడిగాపులు

» చెప్పులు వరుసలో పెట్టి మధ్యాహ్నం వరకు నిరీక్షణ
» ఎరువుల పంపిణీలో అలసత్వంపై రైతుల ఆగ్రహం
» చర్ల, నేలకొండపల్లిలో సొమ్మసిల్లిన ఇద్దరు రైతులు

6



సొమ్మసిల్లి పడిపోయిన మహిళ

'ఉపాధి'ని దెబ్బతీసేలా చట్టంలో మార్పులు

» తక్షణమే ఆ కొత్త సవరణలను ఉపసంహరించుకోవాలి
» వ్యవసాయ కార్మికులకు చట్టబద్ధత కల్పించాలి
» కలెక్టరేట్ ముట్టడిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



ర్యాలీలో పాల్గొన్న నాయకులు, రైతులు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వామపక్ష పార్టీల సూచనలు, మద్దతుతో నాటి యూపీఏ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీసేలా నేటి కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. ప్రభుత్వం కుట్రపూరితంగా నిరుపేదలకు అన్యాయం జరిగేలా చట్టంలో మార్పులు, సవరణలు తీసుకొస్తోందని, ఆ సవరణలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గోపాలపురం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, రైతులు, వ్యవసాయ కూలీలు తరలిరాగా.. ప్రభుత్వ హామీలను నెరవేర్చాలని ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మేనిఫెస్టోను అమలు చేయటం లేదని ఆరోపించారు. రైతులు, వ్యవసాయ కార్మికులను కేవలం ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20నెలలైనా పూర్తి స్థాయిలో ఆసరా పింఛన్లు పెంచాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కల్పించాలని, అర్హత కలిగిన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు చట్టబద్ధత కల్పించాలని, వయోవృద్ధులైన వ్యవసాయ కార్మికులకు పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వర్లు, సిద్దనేని కర్ణకుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేశ్, కార్పొరేటర్ బీజే క్లైమెట్, జానీమియా యర్రా బాబు, పోటు కళావతి, శింగు నర్సింహారావు, సీతామహాలక్ష్మీ, పగడాల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించండి



ఎస్పీ రోహిత్‌రాజుకి ఆహ్వాన పత్రం అందిస్తున్న దృశ్యం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): క్రీడలను ప్రోత్సాహించాలని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. ఈ నెల 14న కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించే జిల్లా స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలకు రావాలని ఎస్పీ రోహిత్‌రాజుకు నిర్వాహకులు సోమవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా నేటి ఆధునిక పోటీ ప్రపంచంలో చదువుతో పాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత పెరిగిందని, అందులో భాగంగా జిల్లాలో క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశ్యంలో జిల్లా స్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. జైభీమ్‌రావ్ భారత్ పార్టీ (జేబీ పీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్, పవర్ హౌస్ జిమ్ యజమాని షామియుద్దీన్, రాజేష్, లారెన్స్‌లు ఉన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

» కలెక్టర్ జితేష్ వి పాటిల్



మణుగూరులో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

మణుగూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం మణుగూరులోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రాన్ని (ఐటీఐ) అకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీసీ భవన సముదాయాన్ని పరిశీలించారు. ఐటీఐలను మరింత ఆధునీకరించే క్రమంలో భాగంగా ఏటీసీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో శిక్షణ పొందిన వారు పారిశ్రామిక రంగంలో మంచి అవకాశాలు పొందే వీలు ఉందన్నారు. విద్యార్థులు శిక్షణా కాలంలో మంచిగా చదువుకుని శిక్షణపొంది ఉద్యోగ అవకాశాలను పొం దాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో వెంకటేశ్వరరావు, ఐటీఐ సూపరింటెండెంట్ జ్యోతిరాణి, ఏటీవోలు కృష్ణారావు, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

దేశ అభివృద్ధికి శాస్త్రవేత్తలు అవసరం

కరకగూడెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : దేశ అభివృద్ధికి ప్రజల భవిష్యత్ పురోగతికి శాస్త్రవేత్తలు అవసరం అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అవ్వాలని తమ అభిలాషను కలెక్టర్ తెలిపారు. సంతోషం వ్యక్తం చేసిన కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యక్తిగత లక్ష్యసాధనతో పాటు దేశాభివృద్ధికి తోడ్పడే దిశగా చదువుకోవడం, పరిశోధనలు చేయడం అత్యంత ముఖ్యమని సూచించారు. సమాజంలో ఉన్న సమస్యలను పరిష్కారం చూపే ఆవిష్కరణలు, పరిశోధనలు చేయగలిగే శాస్త్రవేత్తలు దేశానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు ఆ దిశగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కరాచారి, ఉపాధ్యాయురాలు నయనాదేవి, చంచల్, అనిత, స్టాఫ్‌నర్స్ రాధిక, ఎంపీడీవో కుమార్, ఎంఈవో గడ్డం మంజుల, తహసీల్దార్ ప్రతాప్, ఆర్ఐ కృష్ణ ప్రసాద్, ఎంపీవో మారుతి, కార్యదర్శి కృష్ణ తదితరులున్నారు.

ఆశ్రమ పాఠశాల నుంచి..

సింగరేణి డైరెక్టర్‌గా..

» అంచెలంచెలుగా ఎదిగిన తిరుమలరావు

» 136 ఏళ్ల సింగరేణి చరిత్రలో తొలి ఆదివాసీ బిడ్డ



కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతంలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యనభ్యసించిన మోకాళ్ల తిరుమలరావు సింగరేణి డైరెక్టర్ ఈఅండ్ఎంగా నియమితులయ్యారు. ప్రాథమిక విద్య అంతా ఆశ్రమ పాఠశాలల్లో ప్రారంభమైనా.. ఉన్నత విద్య పట్ల మక్కువతో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. 1969లో ఇల్లెందు మండలం కట్టుగూడెం గ్రామంలో మోకాళ్ల సమ్మయ్య, సీతమ్మ దంపతులకు తిరుమలరావు జన్మించాడు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు చెన్నంగులగడ్డలోని ఆశ్రమ పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన తిరుమలరావు.. 6 నుంచి 10వ తరగతి వరకు కిన్నెరసాని గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించాడు. బూర్గంపాడు మండలంలోని కృష్ణసాగర్ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. సామాన్య, మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన తిరుమలరావును ఆర్టీసీలో మెకానికల్‌గా పని చేసే అతని బావ పాయం వెంకటేశ్వర్లు ఉన్నత విద్య చదవాలని ప్రోత్సహించారు. బావ సూచనతో తిరుమలరావు హైదరాబాద్‌లోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేశారు. చదువు పూర్తయ్యాక తొలి ప్రయత్నంలోనే 1996లో సింగరేణి జూనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీగా ఉద్యోగంలో చేరారు. ఆ తర్వాత ఈఈగా, డిప్యూటీ ఎస్ఈగా, డీవైజీఎంగా, జీఎంగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంతో సింగరేణి యాజమాన్యం అతని ప్రతిభను గుర్తించి ఇటీవలే డైరెక్టర్‌గా నియమించింది. డైరెక్టర్‌గా నియమితులైన తిరుమలరావును సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ, బీఎంఎస్, సీఎంవోఏ సంఘాలతో పాటు సింగరేణి అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ సింగరేణి సంస్థ ముందుకు సాగుతుందని తెలిపారు. సింగరేణి యాజమాన్యం 5వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. ఇప్పటికే ఎస్టీపీపీలో 1200మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నామని.. మరో 800మెగావాట్ల విద్యుత్‌ప్లాంట్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఒరిస్సా రాష్ట్రంలోని నైనీలో సింగరేణి విద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేసి 2400మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన చేయాలనే ప్రతిపాదనలను తయారు చేసి పనులను వేగవంతం చేసే దశగా పయనిస్తుందని తెలిపారు. ప్రధానంగా సోలార్, హైడ్రో, విండ్ ద్వారా కూడా 500మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి కోసం కార్మికులు కృషి చేయాలని తిరుమలరావు కోరారు. ఈ క్రమంలో ఇటీవల తిరుమలరావును కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధి బృందం ఘనంగా సన్మానించింది.

యూరియా కోసం

రైతుల పడిగాపులు

» చెప్పులు వరుసలో పెట్టి మధ్యాహ్నం వరకు నిరీక్షణ

» ఎరువుల పంపిణీలో ఆలస్యంపై రైతుల ఆగ్రహం

» చర్ల, నేలకొండపల్లిలో సొమ్మసిల్లిన ఇద్దరు రైతులు



నేలకొండపల్లిలో యూరియా కూపన్ల కోసం వ్యవసాయాధికారిని చుట్టుముట్టిన రైతులు

జూలూరుపాడు / నేలకొండలపల్లి/చర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల రైతులు యూరియా కోసం సోమవారం జూలూరుపాడులోని సొసైటీ కార్యాలయం వద్ద బారులు తీరారు. సొసైటీలో యూరియా పంపిణీ చేస్తున్నారన్న విషయం తెలుసుకుని ఉదయం ఆరు గంటలకే మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి తరలొచ్చారు. కానీ సిబ్బంది ఎంతకూ యూరియా ఇవ్వకపోవడంతో.. రైతులు చెప్పులను క్యూలో పెట్టి గంటల తరబడి పడిగాపులు కాశారు. దీంతో సిబ్బంది తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువులు అందుబాటులో ఉన్నప్పటికీ.. ఎందుకు పంపిణీ చేయడం లేదని సిబ్బందిని ప్రశ్నించారు. ఉదయం వచ్చి గంటల కొద్దీ యూరియా కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు మధ్యాహ్నం 2గంట లకు సొసైటీ సిబ్బంది రైతులకు యూరియా ను పంపిణీ చేశారు. అయితే రైతులు అధిక సంఖ్యలో రావడంతో.. కొంతమందికి యూ రియా అందకపోవడంతో వారు నిరాశతో వెనుదిరిగారు. నేలకొండపల్లిలోని రైతు వేదిక వద్ద యూరియా కూప న్లు ఇస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న రైతులు భారీ సంఖ్యలో రైతు వేదిక వద్దకు చేరుకున్నారు. కూపన్ల కోసం భారీగా క్యూలైన్లు ఏర్పడ్డాయి. క్యూలో ఉన్నవారు ఉన్నట్టుగా ఉండగానే చాలా మంది రైతులు కూపన్లు జారీ చేసే అధికారుల చుట్టూ మూగారు. దీం తో కొంత గందరగోళం ఏర్పడింది. రైతు వేదిక వద్దనే ఉన్న పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. అయితే యూరియా కోసం వచ్చి క్యూలో నిలబడిన నేలకొండపల్లికి చెంది న కూరాకుల మల్లమ్మ అనే మహిళ క్యూలో సరిగా గాలి ఆడక కుప్పకూలిపోయింది. వెంట నే పక్కనే ఉన్న మహిళలు మల్లమ్మకు సపర్యలు చేసి, మంచి నీళ్ల తాగించటంతో ఆమె కోలుకుంది.

చర్ల: యూరియా కోసం వచ్చి రైతు అస్వస్థతకు గురై, కూలబడ్డ ఘటన చర్ల మండలంలో సోమవారం జరిగింది. చర్ల మండలం తిప్పాపురం గ్రామానికి చెందిన కారం సోమయ్య అనే రైతు యూరియా కోసం మండలంలోని సత్యనారాయణ పురం సొసైటీ వద్దకు వచ్చాడు. ఇదే క్రమంలో టోకెన్ తీసుకుని క్యూలైన్‌లో నిలబడ్డాడు. రైతులు అధికంగా రావడం, గాలి ఆడక పోవడంతో అస్వస్థతకు గురై ఒక్కసారిగా కూలబడ్డాడు. వెంటనే సొసైటీ అధికారులు, రైతులు అతడిని వైద్యశాలకు తరలించారు. వైద్యం అందడంతో సోమయ్య వెంటనే కోలుకున్నాడు. అనంతరం సొసైటీ సభ్యులు అందజేసిన యూరియా బస్తా తీసుకుని గ్రామానికి వెళ్లాడు. వయస్సు ఎక్కువ కావడంతో సోమయ్య అస్వస్థతకు గురయ్యాడని వైద్యులు తెలిపారు.

ఉద్యోగులకే దక్కిన

రాజీవ్ స్వగృహ

(5వ పేజీ తరువాయి)

జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, ఎంపీడీవోల సంఘం అధ్యక్షుడు మల్లెల రవి తదితరులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపయోగంగా ఉన్న రాజీవ్‌స్వగృహ అపార్టుమెంట్లను ఉపయోగంలోకి తెచ్చేందుకు వేలం నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయం సంతోషకరం

● టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు

ఏలూరి శ్రీనివాసరావు

గత ప్రభుత్వం నిరుపయోగంగా ఉంచిన రాజీవ్ స్వగృహభవనాలను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించేందుకు టెండరు నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేసి అధికారులకు, ఉద్యోగులకు,రిటైర్డు ఉద్యోగులకు కేటాయించి సొంత ఇంటి కలను నెరవేర్చుతామన్నారు.

ఇలాంటి మంచి నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, రాజీవ్ స్వగృహ ఎండీవీపీ గౌతమ్‌కు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయస్థాయి క్రీడల్లో కేంద్రీయ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంజాబ్, బెంగుళూరు, హైదరాబాద్ రీజియన్‌లలో ఆగస్టు నెలలో నిర్వహించిన జాతీయస్థాయి కేవీ సంఘటన్ క్రీడా పోటీలలో ఖమ్మం నగరంలోని కరుణగిరి ప్రాంతంలో గల కేంద్రీయ విద్యాలయ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. పోటీలలో సుమారు 51 మంది విద్యార్థులు పాల్గొనగా వారు స్వర్ణ-2 రజత-2, కాంస్య-4 పతకాలతో పాటు రూ.44 వేల నగదు బహుమతులు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ కవీంద్రరాయ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, మల్లయ్య, మనీసుధ తదితరులు ఉన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కవీంద్రరాయ్

పోడు భూములకు

విద్యుత్ సౌకర్యం కల్పించాలని మంత్రికి వినతి

దమ్మపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోడు భూములకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆళ్లపల్లి మండలానికి చెందిన గిరిజన రైతులు మంత్రి తుమ్మలను ఆయన నివాసంలో సోమవారం కలిశారు. గిరిజన రైతులు మాట్లాడుతూ తమకు ఇచ్చిన పోడు భూములకు విద్యుత్ కల్పించాలని మంత్రిని అభ్యర్థించారు. అటవీ సమస్యల వల్ల తమ భూములకు విద్యుత్ సౌకర్యంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తుమ్మల దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై స్పందించి మంత్రి మాట్లాడుతూ పామాయిల్ సాగు చేయండి అవసరమైతే సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసి మోటర్లను అందిస్తామన్నారు. అంతకు ముందు మిర్యాలగూడెం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసారు. కొద్దిసేపు ఏకాంతంగా చర్చించుకున్నారు. కొయ్యల అచ్యుతరావు, మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కాసాని నాగప్రసాదు, మన్నెం అప్పారావు తదితరులున్నారు.

'ప్రభాత కెరటాలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటకు చెందిన ప్రముఖ కవి సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు రచించిన ప్రభాత కెరటాలు కవితా సంపుటిని పలువురు ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ ఫౌండేషన్ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ జానపద అకాడమి తొలి అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ ఆధ్వర్యంలో తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిద్దారెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా నందిని సిద్దారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే సాహిత్యం తెచ్చిన కవి ప్రభాకరాచార్యులు కలకాలం గుర్తుండిపోతారన్నారు. ప్రభాకరాచార్యుల రచనలు సమాజహితం కోరేవిగాను, ఆలోచింపజేసేవిగాను ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితివేత్త, కర్నూల్ పూర్వ డీఐజీ ఇక్బాల్, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరావు, ధర్మక్షేత్రం అధ్యక్షుడు రఘువీర్ ప్రతాప్, నేటినిజం సంపాదకులు బైసదేవదాస్, కన్నడ కవులు జోషి, రమేశ్, గోపి తదితరులు ఉన్నారు.

నీలాద్రి అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక

» భద్రాద్రి-వరంగల్ ప్రధాన అటవీ సంరక్షణ అధికారి (సీసీఎఫ్) భీమానాయక్



అటవీ భూములను పరిశీలిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన మధ్యప్రదేశ్‌లోని భీంబెట్కా రాతి ఆశ్రయాల తరహాలో ఉన్న నీలాద్రి కొండలు విస్తరించి ఉన్నాయని, పురాతన రాతి చిత్రాలతో కూడిన బయనీర్ బండపై ప్రాచీన గుర్తులను పరిశీలిస్తే బౌద్ధ, హిందూ గుహలను తలపిస్తున్నాయని, ఈ నీలాద్రి అభయారణ్యాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు దేవాదాయ శాఖ సహకారంతో అటవీశాఖ బృహత్తర ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు భద్రాద్రి-వరంగల్ ప్రధాన అటవీ సంరక్షణ అధికారి (సీసీఎఫ్) డాక్టర్ భీమానాయక్ తెలిపారు. సోమవారం ఆయన సత్తుపల్లిలో డీఎఫ్‌వో సిద్దార్థ్ విక్రంసింగ్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా 150వ కాంపార్ట్‌మెంట్‌లోని నీలాద్రి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం అటవీ ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల వరకు ట్రెకింగ్‌తో పాటు నేచర్ వాక్‌లో పాల్గొన్నారు. అనంతరం కిష్టారం సెక్షన్, చెరుకుపల్లి బీట్‌లో నర్సరీలు, అటవీ భూములను పరిశీలించి పలు సూచనలు చేశారు. చంద్రాయపాలెంలో పర్యటించి వనసంరక్షణ సమితి సభ్యులతో సమావేశమైన తర్వాత ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ సహకారంతో నీలాద్రి అటవీ ప్రాంతంలోని ప్రాచీన గుర్తులపై పరిశోధన జరిపించి టూరిజం పాయింట్‌గా నీలాద్రి అడవులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆలయం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో బయనీల బండపై ఉన్న ప్రాచీన కాలం నాటి ఆనవాళ్లను గుర్తించేందుకు ఆర్కియాలజీ శాఖ సహకారంతో సర్వే జరిపిస్తామని తెలిపారు. వీఎస్ఎస్ సభ్యుల భాగస్వామ్యంతోనే అటవీ వనరుల సంరక్షణ సాధ్యమవుతుందని, అటవీ పరిరక్షణలో వారి పాత్ర అభినందించదగినదని, వీరికి అటవీశాఖ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు.

వన్య సంరక్షణ ప్రాంతంగా నీలాద్రి అర్బన్ పార్క్

సత్తుపల్లి నీలాద్రి అర్బన్ పార్క్‌లో నూతనంగా నిర్మితమవుతున్న యోగా శిక్షణా కేంద్ర నిర్మాణ పనులను డీఎఫ్ఓ సిద్దార్ద్ విక్రమ్‌సింగ్ పరిశీలించారు. ప్రజలు చురుకుగా ముందుకు వస్తే అటవీ పరిరక్షణ మరింత బలోపేతమవుతుందని, అడవులను సంరక్షించడం, రక్షించడం మనందరి బాధ్యత అని అన్నారు. అర్బన్ పార్క్‌ను వన్య సంరక్షణ ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చుట్టూతా ఫెన్సింగ్ ఏర్పాటు చేశామన్నారు. బయటి జంతువులు పార్క్‌లోని ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో వాడపల్లి మంజుల, రేంజర్ స్నేహలత, సిబ్బంది ఉన్నారు.

నీలాద్రీశ్వర ఆలయం సందర్శన

పెనుబల్లి: నీలాద్రీ కొండపై ఉన్న నీలాద్రీశ్వరస్వామివారిని సోమవారం అటవీశాఖ చీఫ్ కన్సర్వలేటర్ భీమానాయక్, డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అటవీశాఖ పరిధిలో ఉన్న బై నీరు బండను కూడా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రజినికుమారి, చైర్మన్ చీకటి నర్సింహారావులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మిట్టపల్లి నరేంద్ర, రామిశెట్టి శ్రీనివాసరావు, మానికల్ ప్రసాద్, మామిళ్ల సత్యనారాయణ, శ్రీరంగం రవి, ఆలయ, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దసరా సెలవులను ప్రకటించిన విద్యాశాఖ

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలోని పాఠశాలలకు దసరా సెలవులను విద్యాశాఖ ప్రకటించింది. ఈ నెల 21 నుంచి అక్టోబరు 3 వరకు పాఠశాలలకు దసరా సెలవులు ఉంటాయని తెలిపింది. తిరిగి అక్టోబరు 4న పాఠశాలలు తెరుచుకుంటాయి. అదేవిధంగా జూనియర్ కళాశాలలకు ఈ నెల 28 నుంచి అక్టోబరు 5 వరకు దసరా సెలవులు ఉంటాయని తెలిపింది. తిరిగి అక్టోబరు 6న కాలేజీలు పున:ప్రారంభమవుతాయి. విద్యాక్యాలెండర్‌లో గతంలోని దసరా సెలవుల తేదీలను ప్రకటించింది.

పేకాట స్థావరంపై దాడి

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. అశ్వారావుపేటలో కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ అఖిల తన సిబ్బందితో దాడులు జరిపారు. దాడుల్లో రూ.1,850 నగదును స్వాధీనం చేసుకుని ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

రామన్నగూడెంలో

జాయింట్ సర్వేకు అంగీకారం

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 8(అంధ్రజ్యోతి): తమ భూములు తమకు అప్పగించాలంటూ సుదీర్ఘకాలంగా పోరాటం చేస్తున్న మండలంలోని రామన్నగూడెం గిరిజన గ్రామంలో భూములను జాయింట్ సర్వేకు మూడుశాఖల అధికారులు అంగీకకరించారు. రామన్నగూడెం గిరిజనులు 30,36,39 సర్వే నెంబర్లలో తమకు పట్టాలు ఉన్నాయని, తమ భూములు తమకు అప్పగించాలంటూ పోరాటం చేస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం రామన్నగూడెంలో గ్రామసభను నిర్వహించారు. తమ భూములను తమకు ఇవ్వాలని ఇందుకు జాయింట్ సర్వే చేయాలని గిరిజనులు ముక్తకంఠంతో కోరారు. గ్రామసభకు హాజరైన కొత్తగూడెం ఆర్డీవో మధు అందరితో సమీక్షించి జాయింట్ సర్వేకు నిర్ణయించారు. గ్రామసభలో తహసీల్దారు రామకృష్ణ, రేంజర్ మురళీ, సీఐ నాగరాజు, మడకం నాగేశ్వరరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.


అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

(5వ పేజీ తరువాయి)

మున్నేరుపై బ్రిడ్జి పనులు జరుగుతున్నాయన్నారు. కోల్‌కతా, ఒడిస్సా, ఏపీలకు రవా ణా మార్గాన్ని ఈరహదారి అనుసంధానం చేస్తుందని తెలిపారు. నగరం చుట్టూ రింగ్‌రోడ్డు రావడం ద్వారా నగరంలోకి రాకుండా రింగ్‌రోడ్డు ద్వారా వాహనాలు రాకపోకలు జరుగుతాయని, తద్వారా ఖమ్మంలో ట్రాఫిక్ సమస్య ఉండదన్నారు ఇంటిగ్రేటెడ్ స్కూల్, మెడికల్ కళాశాల, స్వామి నారాయణ స్కూల్ త్వరలో అందుబాటులోకి రాబోతున్నాయన్నారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ ఎస్ఈ ఎస్.వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకోబ్, ఆర్డీవో నరసింహారావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. సమీక్ష అనంతరం సమావేశంలో చర్చించిన వివరాలను తుమ్మల విలేకరుల సమావేశంలో వెల్లడించారు.



రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనుల నమూనా



కేబుల్ బ్రిడ్జి నమూనా

అవార్డుల కోసం అడ్డదారి!

» తప్పుడు ప్రతిపాదనలు పంపిన ఓ ప్రధానోపాధ్యాయుడు

» ఇతర ప్రధానోపాధ్యాయుల ఫిర్యాదుతో వెలుగులోకి

» విచారణ అనంతరం ఇన్‌చార్జ్ డీఈవోకు ఎంఈవో నివేదిక



గరికపాడు హైస్కూల్

వైరా, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తమ పాఠశాలకు అవార్డులు దక్కించుకొనేందుకు ఓ ప్రధానోపాధ్యాయుడు వక్రబుద్ధి చూపిన ఉదంతమిది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఇచ్చే అవార్డుల కోసం సదరు ప్రధానోపాధ్యాయుడు తమ పాఠశాలలో లేని ర్యాంకులతో మండల, జిల్లా విద్యాశాఖకు ప్రతిపాదనలు పంపించి అడ్డంగా దొరికిపోయాడు. జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి అయిన అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఆదేశాలతో వైరా ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు జరిపిన విచారణలో సదరు ప్రధానోపాధ్యాయుడి బాగోతం తేటతెల్లమైంది. దాంతో ఈ మండలంలో ప్రతిభావంతులైన ఐదుగురు ఉపాధ్యాయులు.. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తమకు దక్కాల్సిన అవార్డులను కోల్పోయారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వైరా మండలంలోని గరికపాడు ప్రధానోపాధ్యాయుడు దొంతెబోయిన సత్యనారాయణ తమ పాఠశాలలోని విద్యార్థులు ఆయా పాఠ్యాంశాలలో సాధించిన వాస్తవ ర్యాంకులకు బదులు ఫేక్ ర్యాంకులతో అవార్డుల కోసం జిల్లా, మండల విద్యాశాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. గతేడాది పదోతరగతి ఉత్తీర్ణతా శాతం ఆధారంగా ఒక సాంఘిక శాస్త్రం సబ్జెక్టు మినహాయించి మిగిలిన తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం సబ్జెక్టుల్లో తమ పాఠశాల విద్యార్థులు సాధించిన మార్కులను పక్కన పెట్టి ఎక్కువ మార్కులు వచ్చినట్టుగా తప్పుడు ప్రతిపాదనలను అవార్డుల కోసం పంపించారు. ఒకే పాఠశాల నుంచి ఒక సాంఘిక శాస్త్రం మినహా మిగిలిన ఐదు సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయుల బోధనకు గాను అవార్డులకు ప్రధానోపాధ్యాయుడు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలు అందిన వెంటనే ఎంఈవో వెంకటేశ్వర్లు పరిశీలించి ఐదుగురు ఉపాధ్యాయులను ప్రతిభావంతులుగా పేర్కొంటూ అవార్డులకు ప్రతిపాదించటాన్ని ప్రస్తావించి మరోసారి సరిచూసుకోవాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. అయితే తానిచ్చిన అవార్డుల జాబితా కచ్చితమైనదేనని ఆ ప్రధానోపాధ్యాయుడు స్పష్టం చేశారు. ఈ సమయంలో మండలంలోని ఇతర హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు అవార్డుల ప్రతిపాదన జాబితాపై ఇన్‌చార్జ్ డీఈవో శ్రీజకు ఫిర్యాదు చేశారు. ఆవెంటనే విచారణకు ఎంఈవోను ఆమె ఆదేశించారు. విచారణ నిర్వహించిన ఎంఈవో అవార్డుల జాబితా ప్రతిపాదన తప్పుడుదని నిర్ధారించి ఇన్‌చార్జ్ డీఈవో శ్రీజకు నివేదిక సమర్పించారు.

దాంతో అరోతేదీన మండలంలోని ఆ ఐదుగురు ఉపాధ్యాయులకు అవార్డులు ఇవ్వకుండా నిలిపివేశారు. ఒక్క రెబ్బవరం హైస్కూల్లోని సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడికి మాత్రమే అవార్డు ఇచ్చారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదోతరగతి పరీక్షా ఫలితాల్లో రెబ్బవరం హైస్కూల్లో అత్యధికంగా ఒక విద్యార్థికి 572మార్కులు వచ్చాయి. సిరిపురం హైస్కూల్లో ఒక విద్యార్థికి 561మార్కులు, గరికపాడు హైస్కూల్లో ఒక విద్యార్థికి 491 మార్కులు లభించాయి. వీటి ఫలితంగా రెబ్బవరం హైస్కూల్లో ఇంగ్లీష్, గణితం, సాంఘిక శాస్త్రంలో, సిరిపురం హైస్కూల్లో తెలుగు, హిందీ, సైన్స్ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు అవార్డులు రావాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా ఒక్క సాంఘిక శాస్త్రం మినహాయించి మిగిలిన ఐదు సబ్జెక్టుల్లో తమ గరికపాడు ఉపాధ్యాయులే ముందున్నట్టు అవార్డుల కోసం ప్రధానోపాధ్యాయుడు ప్రతిపాదనలు పంపించి ప్రధానోపాధ్యాయుడు అడ్డంగా దొరికిపోయాడు. దాంతో డీఈవో శ్రీజ సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేశారని సమాచారం. ఈ సమయంలోనే ఒక ఉపాధ్యాయ సంఘం నుంచి ఎన్నికైన ఒక ఎమ్మెల్సీ ద్వారా తనపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా సదరు ప్రధానోపాధ్యాయుడు ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించినట్లు ఉపాధ్యాయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాను అవగాహన రాహిత్యంతో చేసిన పొరపాటేనని, సాంకేతికంగా దొర్లిన ఈ తప్పును తాను సరిచేసి ఉన్నతాధికారులకు పంపించినా దాన్ని పరిగణలోకి తీసుకోలేదని ఆ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తన సహచర ఉపాధ్యాయులకు చెబుతున్నారు. ఈ ఫేక్ అవార్డుల ప్రతిపాదన అంశాన్ని ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు ధ్రువీకరించారు.



స్వామి వారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

చంద్రగ్రహణం అనంతరం.. తెరుచుకున్న రామాలయం

ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు

భద్రాచలం, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకొని ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు మూసివేసిన భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయాన్ని గ్రహణం అనంతరం సోమవారం తెల్లవారుజామున మూడు గంటలకు తెరిచారు. అనంతరం ఆలయ శుద్ధి సంప్రోక్షణ, సుప్రభాత సేవ, ఆరాధన, సేవాకాలం, నివేదన నిర్వహించారు. అదేవిధంగా యాగశాలలో హోమాన్ని సైతం నిర్వహించారు. అనంతరం 7.30 గంటలకు భక్తులకు సీతారామచంద్రస్వామి మూలవరుల దర్శనం కల్పించారు. అలాగే సోమవారం కావడంతో ముత్తంగి అలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా కేశవనామార్చన, సహస్రనామార్చన, నిత్యకల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థానం ప్రధానఅర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, ఉపప్రధాన అర్చకులు కోటిరామస్వరూప్ రాఘవాచార్య తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయంలో నీటితో కడుగుతున్న దృశ్యం



క్యూలైన్, ఆలయ ఆవరణలో నీటితో కడుగుతున్న దృశ్యం



హోమం నిర్వహిస్తున్న వైదిక సిబ్బంది

కాళోజీ రచనలు
సామాజిక చైతన్యానికి స్ఫూర్తి

తెలంగాణ భాష, యాస కోసం కృషి చేసిన మహనీయుడు
కాళోజీ సేవలను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
నేడు కాళోజీ నారాయణరావు జయంతి

చుంచుపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : దేశబాషలందు తెలుగులెస్సా అంటూ సామాజిక చైతన్యం కోసం తన రచనలతో సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కలం ఎత్తిన ప్రజాకవి, ఉద్యమమే ఊపిరిగా జీవించిన మహనీయుడు కాళోజీ నారాయణరావు. తెలుగుభాష ఔనత్యం కోసం కాళోజీ చేసిన కృషి వెలకట్టలేనిది. కవి, రచయిత, తెలంగాణ తొలిపొద్దు కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని సెప్టెంబరు 9వ తేదీన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలుగుభాషా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారు.

కాళోజీ రచనలతో సామాజిక చైతన్యం

సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు కాళోజీ రచనలు ఎంతగానో స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. కాళోజీ కథలు నా గొడవ, జీవన గీత, తుది విజయం మనది, తెలంగాణ ఉద్యమ కవితలు అయిన ఇదీ నా గొడవ, బాపూ.. బాపూ.. బాపూ పరిగణలోకి వస్తాయి. తెలంగాణ యాసలో సులువుగా అందరికి అర్థమయ్యే రీతిలో రచించిన ఈ రచనలు, కవితలు ప్రతి ఒక్కరినీ కదిలిస్తున్నాయి. ప్రజలు పడుతున్న ఇబ్బందులకు చలించి ఎన్నో పుస్తకాలు రచించారు. కాళోజీ జీవితాన్ని, కవిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని వేర్వేరుగా చూడలేము. కొద్దిమంది పండితులకే పరిమితమైన చదువును, సాహిత్య సృష్టిని.. సృజనాత్మకత శక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చి నిత్య వ్యవహారాన్ని, భాషలోని మాధుర్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. తెలంగాణ భాషా పితామహుడుగా చిరస్థాయిగా కీర్తిని కాళోజీ గడించారని అతని రచనలే చెపుతున్నాయి. భాషా పునాదులపై అభివృద్ధికర నవసమాజ నిర్మాణానికి కృషి చేయాలని తెలిపిన మహోన్నత వ్యక్తి కాళోజీ.



కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.శారద, తదితరులు (ఫైల్)

తెలంగాణ భాష, యాస కోసం కృషి

తెలంగాణ భాష, యాస కోసం కాళోజీ కృషి వర్ణింపలేనిది. భాషకు పట్టం కట్టి, నినదించి ప్రజల్లో చైతన్య దీప్తిని వెలిగించిన మహనీయుడుగా గుర్తింపు పొందాడు. సమాజాన్ని ఎదిరించిన వాడే ఆరాధ్యుడని వ్యక్తం చేస్తూ ఉద్యమమే ఊపిరిగా జీవించి తెలంగాణ భాషకు గౌరవ ప్రతిష్టలు తెచ్చిన ప్రజాకవి కాళోజీ అని కథకులు, కవులు, రచయితలు అభివర్ణిస్తున్నారు. సమాజహితమే సాహిత్య అంతమ లక్ష్యమని జీవించిన చిరస్మరణీయుడు కాళోజీ. ఆయన ఆశయాలైన భాషను, యాసను గౌరవిస్తూ భాషా ఔనత్యాన్ని చాటాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ ఉంది.

కాళోజీ సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం

కాళోజీ పోరాటం, ఆకాంక్షతోనే ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఏర్పాటు జరిగింది. తన జీవితాన్ని ప్రజలకు అంకితమిస్తూ తను ఏర్పర్చుకున్న లక్ష్యాలను సాధించే దిశగా అడుగులు వేశాడు. ఈ క్రమంలో కాళోజీ రచనలు, పోరాటాలు, త్యాగాలను గతంలో భారత ప్రభుత్వం, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం గుర్తించి గౌరవించింది. 1981 ఏడాదిలో ప్రజాకవి బిరుదును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, 1992లో దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారం పద్మ విభూషణ్ అవార్డును భారత ప్రభుత్వం ప్రకటించి ప్రదానం చేసింది. అదే ఏడాది వరంగల్ ప్రాంతంలోని కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ అందజేసింది. 2002 ఏడాదిలో కాళోజీ మరణానంతరం పార్థివదేహాన్ని వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలకు అందజేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం వైద్యవిద్యను వరంగల్ కేంద్ర బింధువుగా 2014 లో కాళోజీ నారాయణరావు యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌గా ఏర్పాటు చేశారు.

ఉద్యమకాలంలో నాలుకపై నాట్యమాడిన తెలంగాణ యాస

ఉద్యమకాలంలో ప్రజల నాలుకపై తెలంగాణ యాస నాట్యమాడింది. నర నరాన్ని కదిలించి జీవం పోసుకుంది. ఆ యాసకు జై కొట్టింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలమైన, ప్రత్యేక తెలంగాణ పోరాటమైన ప్రజలను మేల్కొల్పింది, కదిలించింది కథన రంగంలో దూకించింది తెలంగాణ భాష.



పి.స్వప్న, సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి, కొత్తగూడెం

మల్లంపాడు చెరువు సమీప భూముల వద్ద
రైతుల ఘర్షణ

భూమి తమదంటే తమదని కర్రలతో పరస్పర దాడులు
ఐదుగురికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
ఓసీ ప్రభావిత భూముల నష్టపరిహారం కోసం ఘర్షణలు



కర్రలతో దాడి చేస్తున్న ఇరు వర్గాలు

మణుగూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసీ విస్తరణకు సంబంధించి భూ వివాదాలు రోజు రోజుకు సృతిమించి పోతున్నాయి. సోమవారం ఓసీ విస్తరణ ప్రభావిత భూమి ప్రాంతమైన మల్లంపాడు చెరువు సమీప భూముల్లో రెవెన్యూ సిబ్బంది సర్వే పనులను ప్రారంభించింది. అయితే ఇక్కడికి చేరుకున్న పాత మణుగూరులో నివాసముండే తమ్మిశెట్టి కుటుంబీకులు, చల్లా కుటుంబాలకు చెందినవారు రెండు వర్గాలుగా ఏర్పాడి తొలుత వాగ్వివాదానికి దిగారు. రెవెన్యూ సిబ్బంది 853 సర్వే నెంబర్ గల భూమి ప్రాంతానికి రాక ముందే ఆ భూమి మాదంటే మాది అంటూ ఇరువర్గాలకు చెందిన వారు వాగ్వివాదానికి దిగి కర్రలతో దాడులు చేసుకున్నారు. దీంతో ఈప్రాంతంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సర్వే నెంబర్‌లోని 12 ఎకరాల భూమిని తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, వెంకటనర్సు, తమ్మిశెట్టి శ్రీను, మోహన్, వీరబాబులు నలభై ఏళ్లుగా సాగు చేస్తుంటే.. చల్లా తిరుపతి, నరసయ్య, మల్లేష్ తదితరులు మా భూమి అంటూ దాడులకు పాల్పడ్డారని తెలిపారు. ఈ ఘర్షణలో తమ్మిశెట్టి కుటుంబానికి చెందిన ఐదుగురికి గాయాలు కాగా వారిని ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందిస్తున్నారు. దీంతో మణుగూరు ఓసీ విస్తరణ కోసం జరుగుతున్న సర్వేల్లో భూ వివాదాల పరిష్కారం జఠిలంగా మారింది. ఎకరానికి లక్షల ప్యాకేజీ వచ్చేసరికి అనుభవదారు, పట్టాదారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఇరు వార్గాల మధ్య జరిగిన దాడిపై పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.

పోక్సో కేసులో విచారణ

తల్లాడ, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేసిన యువకుడిపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి సోమవారం తల్లాడ మండలం మల్లవరం గ్రామంలో వైరా సీఐ ఎన్.సాగర్ విచారణ జరిపారు. గ్రామానికి చెందిన దుగ్గిదేవర కృష్ణారావు అనే యువకుడుపై ఈనెల 4న తల్లాడ పోలీసుస్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఈ మేరకు కేసు పూర్వాపరాలను తెలుసుకునేందుకు సీఐ విచారణ చేపట్టారు.

వాగులో గల్లంతైన వ్యక్తి మృతి

పాల్వంచ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ ముర్రేడువాగులో గల్లంతై వ్యక్తి మృతి చెందిన ఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం పాత పాల్వంచకు చెందిన యాటా సురేష్(35) స్థానికంగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం బంగారుజాలలోని తన అత్తగారింటికి బయలుదేరాడు. మార్గంమధ్యలో గుడిపాడు వద్ద ముర్రేడువాగు దాటుతూ వరదఉధృతికి వాగులో కొట్టుకుపోయాడు. అతని భార్య దుర్గాభవానీ తల్లికి ఫోన్ చేయగా అక్కడకు రాలేదని తెలియడంతో ఆ రోజంతా భర్త రాకకోసం ఎదురు చూసింది. మరుసటి రోజు తన మరిదితో కలిసి భర్త ఆచూకీ కోసం వెతుకుతుండగా స్థానికులు ముర్రేడువాగు దాటుతుండగా చూసామని చెప్పారు. దీంతో వాగు ఒడ్డున వెతుకుతుండగా సురేష్ మృతదేహం లభించింది. దీంతో తన భర్త వరద ఉధృతికి వాగులో కొట్టుకుపోయి మృతి చెందాడని, ఎవరిపై ఎటువంటి అనుమానాలు లేవని దుర్గాభవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

వాగులో కొట్టుకొచ్చిన మహిళ మృతదేహం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాత కొత్తగూడెంలోని వాగులో సోమవారం ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం కొట్టుకొచ్చింది. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పాత కొత్తగూడెం డంపింగ్ యార్డ్ వెనుకాల ముర్రేడు వాగులో గుర్తుతెలియని మృతదేహం కొట్టుకొచ్చిందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం మేరకు సంఘటన స్థలానికి కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్ఐ రాకేష్, సిబ్బంది చేరుకొని మహిళ మృతదేహాన్ని కొత్తగూడెం సర్వజన ఆస్పత్రి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిస్తే వన్‌టౌన్ పోలీసులకు 8712682017, 8712682019 నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

60 కేజీల గంజాయి స్వాధీనం

జూలూరుపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు సోమవారం పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వివరాలు ఇలా.. బొలేరో వాహనంలో ఇద్దరు వ్యక్తులు సుమారు 60 కేజీల గంజాయిని కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మీ, ఎస్సై బాదావత్ రవి తన సిబ్బందితో కలసి మండలంలోని మాచినేనిపేట తండా సమీపంలో వాహనాన్ని ఆపి అందులో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని ఎక్కడ కొనుగోలు చేశారు? ఎక్కడికి తరలిస్తున్నారు అన్న కోణంలో పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.

కులం పేరుతో దూషించిన కేసులో నిందితుడికి 5 ఏళ్ల జైలుశిక్ష

ఖమ్మం లీగల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామానికి చెందిన నిందితుడుకి కులం పేరుతో దూషించిన కేసులో 5 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.9500 జరిమాన విధిస్తూ ఖమ్మం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి డి.రాంప్రసాదరావు సోమవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది కథనం ప్రకారం ఫిర్యాది ఖమ్మం నుంచి నిందితుని ఆటోలో తన గ్రామానికి వచ్చింది. ఆటోదిగి ఇంటికిపోగా మరల ఆటోలో తన సామానులు మరిచిపోయానని నిందితుడిని అడగగా నిందితుడు తనను కులం పేరుతో దూషించాడని 2019 జనవరి 23న కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు నిందితునిపై షెడ్యూల్ కులాలు మరియు షెడ్యూల్ తెగల సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. నిందితుడిని అరెస్ట్‌చేసి కేసును విచారించి కోర్టులో చార్జిషీట్ దాఖలుచేయగా ఆ కేసును విచారించిన న్యాయాధికారి నిందితుడిపై నేరం రుజువు కావటంతో పైవిధంగా శిక్షవిధిస్తూ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్‌ప్రాసిక్యూటర్ బి.కృష్ణమోహన్ వాదించగా లైజన్ ఆఫీసర్ కె.శ్రీకాంత్ కెస్ఐ, హోంగార్డు ఎండి.పాషా, చిట్టిబాబులు సహకరించారు.

ఇసుక లారీ పట్టుకున్న పోలీసులు

దమ్మపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా నుంచి దమ్మపేట మండలానికి ఇసుకను అక్రమంగా లారీలో తరలిస్తుండగా దమ్మపేట పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఆంధ్రా నుండి గాంధీనగరం సమీపంలో అక్రమంగా ఇసుకను తరిలిస్తుండగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో ఇసుక లారీకి సంబంధించిన కాగితాలు లేకపోవటంతో అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసునమోదు చేసి, లారిని దమ్మపేట స్టేషన్‌కు తరిలించారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్ష

ఖమ్మం లీగల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని జూబ్లీపురకు చెందిన పుచ్చకాయల లింగరాజుకు సంవత్సరం జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి రూ.8లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ సోమవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా.. ఖమ్మం నగరంలోని చైతన్యనగర్‌కు చెందిన పోలిశెట్టి రాంబాబు వద్ద నిందితుడు తన కుటుంబ అవసరాల నిమిత్తం రూ.5లక్షను 23 ఏప్రిల్ 2016న రుణం తీసుకున్నాడు. అదేరోజు ఫిర్యాదికి 150 గజాల స్థిరాస్తిని రిజిస్ట్రేషన్ ద్వారా తనకాచేయించి ఇచ్చినాడు. కొంతకాలం తరువాత ఫిర్యాది తన రుణం తిరిగి చెల్లించమని ఒత్తిడిచేయగా 1 అక్టోబర్ 2019 నాడు రూ.8లక్షల 75వేలకు చెక్కు ఇచ్చాడు. అట్టి చెక్కును ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమచేయగా నిందితుని బ్యాంక్ ఖాతాలో సరిపడ నగదు లేనందున తిరస్కరణకు గురైనట్లుగా బ్యాంక్‌వారు మెమో జారీ చేశారు. దీంతో ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగ్ నోటీస్ జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలుచేసినారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరుం రుజువుకావటంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

ఇచ్చిన హామీలు అమలుచేయడంలో కాంగ్రెస్ విఫలం

బీజేపీ రాష్ట్రనాయకుడు, మాజీ ఎమ్మెల్యే శానంపుడి సైదిరెడ్డి

ఖమ్మంబైపాస్‌రోడ్, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే శానంపుడి సైదిరెడ్డి విమర్శించారు. ఖమ్మం జడ్పీసెంటర్‌లో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్పు అంటూ ఓట్లు దండుకున్న కాంగ్రెస్ నేడు ప్రజల విశ్వాసాన్ని మోసం చేసిందన్నారు. సోనియాగాంధీ సంతకంతో పంచిన కరపత్రాల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, అదనంగా ఇచ్చిన 66హామీల్లో ఒక్కటీ అమలుకాలేదన్నారు. జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కురిసినవర్షాలతో రహదారుల దెబ్బతిని రవాణ అంతరాయం ఏర్పడిందన్నారు. గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి వరకు విషజ్వరాలు, పారిశుధ్య సమస్యలు పెరిగిపోతున్నాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అక్రమాలు జరగడంతో లబ్ధిదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గెంటేల విద్యాసాగర్, సన్నే ఉదయ్‌ప్రతాప్, దేవకి వాసుదేవరావు, వి.రమేష్, జ్వాల నరసింహారావు, నల్లగట్ల ప్రవీణ్‌కుమార్, గుత్తా వెంకటేశ్వర్లు, నంబూరి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైదిరెడ్డి

బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా వాసుదేవరావు

బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా దేవకి వాసుదేవరావు నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్రపార్టీ కార్యాలయం నుండి సోమవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావుతో పాటు పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కెమికల్ ట్యాంకర్ డ్రైవర్‌కు పాము కాటు

మణుగూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఎస్ఎంఎస్ ప్లాంట్‌లో సోమవారం ఓ కెమికల్ ట్యాంకర్ డ్రైవర్ వీరేందర్ పాము కాటుకు గురైయ్యాడు. బాంబేకు చెందిన వీరేందర్ ఎస్ఎంఎస్ ప్లాంట్‌కు కాల్షియం నైట్రేట్‌ను ట్యాంకర్ ద్వారా శనివారం తీసుకొచ్చారు. ఆదివారం లారీ లోడింగ్ లేకపోవడంతో ఓ చెట్టుకింద పెట్టి నిద్రపోయాడు. నిద్రిస్తున్న ఇతన్ని రక్తపింజర పాము కాటు వేసింది. అతను వెంటనే సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. పాము కాటుకు గురైన వీరేందర్‌ను 108 ద్వారా తొలుత మణుగూరు ఏరియా ఆస్పత్రికి తర్వాత భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. కాగా సోమవారం సింగరేణి అధికారులు భద్రాచలం నుంచి కొత్తగూడెం సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందిస్తున్నట్లు తెలిసింది. కానీ అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సు, ట్రాక్టర్



ప్రమాదానికి గురైన వాహనాలు

అశ్వాపురం, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): మణుగూరు డి పోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన సోమవారం మిట్టగూడెంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం వెళ్తున్న మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, ఇటుకల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ మండల పరిధిలోని మిట్టగూడెం వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సు, ట్రాక్టర్ దెబ్బతినగా, ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కన చెట్లల్లోకి దూసుకెళ్లింది. దీంతో బస్సులోని డ్రైవర్, కండక్టర్‌తో పాటు నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి, మణుగూరు సీఐ నాగబాబు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. బస్సు డ్రైవర్ రాజయ్య చాకచాక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

లారీని ఢీకొట్టిన ఇసుక ట్రాక్టర్

ముదిగొండ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టిన సంఘటన ముదిగొండ మండలం అమ్మపేట వద్ద సోమవారం చోటు చేసుకుంది. ఇసుక అన్‌లోడ్ చేసి అతివేగంగా వస్తున్న ట్రాక్టర్ అమ్మపేట స్టేజీ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ముందుభాగం మొత్తం దెబ్బతినగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇసుక ట్రాక్టర్లు అతివేగంగా నడుపుతూ ప్రయాణీకులను భయభ్రాంతులకు గురిచేయడమే కాక, ఇసుక అక్రమ రవాణా చేపడుతూ లైసెన్స్‌లు కూడా లేని యువకులు డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలు చేస్తున్నారని ప్రయాణీకులు ఆరోపిస్తున్నారు.

క్షుద్రపూజలు చేస్తున్నారనే నెపంతో దాడి

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో క్షుద్ర పూజలు, చేతబడులు చేస్తున్నారనే కారణంలో ఇరువురిపై గ్రామస్థులు దాడిచేయగా బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా.. మండలంలోని నందిపాడు గ్రామానికి చెందిన పి.వెంకటేశ్వరావు, ఎం.రంగారావులు రెండు రోజుల క్రితం గ్రామానికి దగ్గరలో అచ్యుతాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి పూజలు చేస్తున్నారు. రాత్రి వేళ రహదారుల వెంట పసుపు కుంకమ, నిమ్మకాయలు ఉండటంతో గ్రామానికి చెందిన కొందరు యువకులు పూజలు చేసే ప్రాంతానికి వెళ్లి వారిరువురిపై దాడిచేశారు. దీంతో బాధితులు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమపై అకారణంగా దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపధ్యంలో సోమవారం సాయంత్రం గ్రామానికి చెందిన దాదాపు 100 మంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చి జరిగిన సంఘటనను పోలీసులకు వివరించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పైసలిస్తేనే ఇంటినెంబర్

- కమిషనర్‌ను తప్పుదోవ పట్టిస్తున్న రెవెన్యూ విభాగం
- గాడిలో పడని కేఎంసీ రెవెన్యూ వ్యవస్థ
- విచారణ చేపట్టిన కమిషనర్



ఖమ్మం మునిసిపల్ కార్యాలయం

ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలోని రెవెన్యూ విభాగానికి పట్టిన అవినీతి చీడ వీడి పోవటం లేదు గతంలో ఇంటి నెంబర్ల కేటాయింపులో అనేక అక్రమాలు చోటు చేసుకోవటంతో 'ఆంధ్రజ్యోతి'లో వరస కథనాలు ప్రచురితం కావటంతో ఆర్ఐలనుంచి ఆర్వోల వరకు డిమోషన్లు పొందారు. ఇతర ప్రాంతాలకు బదిలీలు జరిగాయి. కానీ అవినీతిలో మూలాలైన బిల్‌కలెక్టర్లపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రభుత్వాలు మారిన కేఎంసీలోని రెవెన్యూ విభాగంలో అవినీతిలో మార్పులు రావటం లేదు. ప్రభుత్వం పౌరసేవల కోసం ఇంటి నెంబర్ల కేటాయింపులో సెల్ఫ్ ఎసెస్‌మెంట్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. అయితే కేఎంసీ రెవెన్యూ విభాగం ఉద్యోగుల కనుసన్నలతో జరిగిన సెల్ఫ్‌ఎసెస్‌మెంట్‌లు తర్వాత మామూళ్లు ఇవ్వక పోవటంతో రిజెక్టు పాలైతున్నాయి.

తిరుగు ప్రయత్నాల్లో ఆర్వో

పలు వివాదాలతో కేఎంసీలో పనిచేసిన ఆర్వో శ్రీనివాసరావును మూడు నెలల క్రితం నెరేడుచర్లకు డిప్యూటేషన్ వేశారు. అక్కడ పనిచేస్తున్న యాకూబ్‌పాషాను ఖమ్మం నగర పాలక సంస్థ ఆర్వోగా పంపారు. అయితే డ్యూటీలో చేరిన నాటి నుంచి తిరుగు ప్రయత్నాల్లోనే ఆర్వోయాకూబ్‌పాషా ఉన్నట్లు విమర్శలు వెలువడుతున్నాయి. కార్యాలయం మినహా ఖమ్మం నగరంలో పర్యటించటం లేదని తెలుస్తోంది. దీంతో బిల్‌కలెక్టర్లు నుంచి ఆర్‌ఐలపై ఆర్వో పట్టు సాధించలేక పోయారు. దీంతో బిల్‌కలెక్టర్లు, ఆర్‌ఐలు అందినకాడికి దండుకునే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శలు వెలువడుతున్నాయి.

వైద్యుడు రూ.20వేలు ఇవ్వలేదని ?

నగరంలోని 27వ డివిజన్‌లో ఓ ప్రభుత్వ వైద్యుడు సొంత ఇళ్లు కట్టుకున్నారు. ఇంటి నెంబర్ కోసం స్థానికంగా ఉన్న బిల్‌కలెక్టర్‌కు అనేక పర్యాయాలు కబురు చేశారు. ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో కేఎంసీలోని మరో రెవెన్యూ విభాగం ఉద్యోగి సలహాలతోనే సెల్ఫ్‌ఎసెస్‌మేంట్ ఆన్‌లైన్ పూర్తి చేశారు. ఈక్రమంలోనే అదే ప్రాంతానికి చెందిన బిల్ కలెక్టర్ ఇంటినెంబర్ కేటాయించటానికి రూ.20 వేలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ హాస్పటల్‌లో వైద్యులకు సేవలు అందించే నేను ఎక్కడ నుంచి అదనంగా రూ.20వేలు ఇవ్వాలని అంగీకరించ లేదు.దీంతో వారంరోజులు చూసిన రెవెన్యూ అధికారులు ఇంటి నెంబర్‌ను రిజెక్టు చేశారు.

కమిషనర్‌కు తప్పుదోవ

ఇంటినెంబర్ సెల్ఫ్‌ఎసెస్‌మెంట్ సందర్భంగా కేఎంసీ రెవెన్యూ విభాగం ఉద్యోగుల సూచనలతోనే కేఎంసీ ఆధ్వర్యంలోనే ప్రభుత్వ వైద్యుడి ఇంటికొలతలు, ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశారు. కానీ ఇంటినెంబర్ కేటాయింపు సందర్భంలో బిల్‌కలెక్టర్‌తో పాటుగా ఆర్ఐ తప్పుడు సమాచారం అందించారు. ఇంటి కొలతలు తేడా ఉన్నాయని చెప్పారు. ఇంటి నెంబరు కేటాయించలేదు.

విచారణ చేపట్టిన కమిషనర్

ఇంటినెంబర్ రిజెక్టుపై సదరు ప్రభుత్వ వైద్యులు స్థానిక కార్పొరేటర్‌ను వెంట తీసుకొని కేఎంసీ కార్యాలయానికి వచ్చారు. తన ఇంటి నెంబర్ కేటాయింపు సందర్భంగా జరిగిన విషయాలను ఆర్వో యాకూబ్‌పాషతో పాటుగా కమిషనర్ అభిషేక్ అగస్త్యకు ఫోన్‌లో వివరించారు. దీంతో కమిషనర్ విచారణ చేపట్టారు.

చోరీ కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్టు

రూ.16లక్షల విలువైన సొత్తు స్వాధీనం
వివరాలు వెల్లడించిన ఏసీపీ రమణమూర్తి, సీసీఎస్ ఏసీపీ సర్వర్

ఖమ్మంక్రైం, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంతో పాటు పలు ప్రాంతాల్లో నేరాలకు పాల్పడిన ఇద్దరు పాతనేరస్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఖమ్మంటౌన్ ఏసీపీ రమణమూర్తి సీసీఎస్ ఏసీపీ సర్వర్ తెలిపారు. ఖమ్మంలోని ఏసీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టూటౌన్ సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో బైపాస్‌రోడ్డులోని కొత్తబస్టాండ్ సమీపంలో సోమవారం తనిఖీలు నిర్వహిస్తుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లికి చెందిన ఆటోడ్రైవర్ చల్లా వెంకటేశ్వర్లు, భద్రాచలం శ్రీరాంనగర్‌కాలనీకి చెందిన దేవబోయిన మహేష్ అనుమానస్పదంగా కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా కొంతకాలంగా ఖమ్మం నగరంలోని ముస్తఫానగర్‌లో నివాసం ఉంటూ ఇళ్లకు తాళంవేసి ఉంటే పగులగొట్టి, మహిళ మెడలోని గొలుసులు చోరీలకు పాల్పడినట్టు విచారణలో తెలిపారు. అదే విధంగా మొత్తం 26 చోరీలకు పాల్పడినట్టు గుర్తించామని, వీటిలో ఖమ్మంవన్‌టౌన్ 5, ఖానాపురంహవేలి 4, ఖమ్మంరూరల్ 2, బోనకల్ 2, కామేపల్లి, వేంసూరు, ఏన్కూరు, సత్తుపల్లి, కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కో కేసులో నిందితులుగా ఉన్నట్టు ఏసీపీ తెలిపారు. విచారణ అనంతరం వారివద్ద నుండి సుమారు 127 గ్రాముల బంగారు వస్తువులు, 500 గ్రాముల వెండి వస్తువులు, ఒక టీవీ, 4 సౌండ్ బాక్సులు, 3 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. చోరీలకు పాల్పడిన నగదుతో ఈ ద్విచక్రవాహనాలు కొనుగోలు చేశారని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్టు ఏసీపీ తెలిపారు. అదేవిధంగా చోరీ సమయంలో బాధితులు పోగొట్టుకున్న సొత్తు కాకుండా అధికంగా పోయిందంటూ ఫిర్యాదులు చేస్తున్నారని, రికవరీలో అసలు ఎంత అనేది తెలుస్తుందని తెలిపారు. ఓ కేసులో అసలు బంగారమే పోకుండా బంగారం చోరీ జరిగినట్టు ఫిర్యాదు చేశారని, ఇలాంటి కేసుల వల్ల రికవరీ చేయడం ఆలస్యమవుతుందని పేర్కొన్నారు. మరో కేసులో బంగారు వస్తువులు పోయాయని ఫిర్యాదు రావడంతో ఫొటోలు చూపించాలని అడగ్గా వారు చూపించిన ఫొటోలు ప్రకారం పట్టుబడిన నిందితుడిని విచారించగా అవి గిల్ట్ నగలని తెలిసింది. అదేవిధంగా అపార్టుమెంట్లలో వాచ్‌మెన్లు అప్రమత్తంగా ఉండే లా నిర్వాహకులు చూడాలని ఇటీవల బైపాస్‌రోడ్డు సమీపంలో జరిగిన ఓ చోరీలో మధ్యప్రదేశ్ గ్యాంగ్‌గా గుర్తించామన్నారు. ఈ సమావేశంలో సీఐలు రాజు, భానుప్రకాష్, బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీలు రమణమూర్తి, సర్వర్



నేలకొండపల్లి మైనారిటీ గురుకుల క్యాంపస్ మార్పు

ఖమ్మంరూరల్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): జలగంనగర్‌లో నిర్వహిస్తున్న నేలకొండపల్లి మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలను ఆరెంపుల పరిధిలోని మహ్మదీయ క్యాంపస్‌లోకి మార్చినట్లు ప్రిన్సిపల్ ఆర్.రాంబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేటినుంచి మహ్మదీయ క్యాంపస్‌లో పాఠశాల పునఃప్రారంభం అవుతుందన్నారు. 5నుంచి9వతరగతి వరకు ఖాళీగా ఉన్న అన్నికేటగిరిల్లో ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో కూడా ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామని తెలిపారు.

హెచ్ఐవీ నియంత్రణకు కృషి చేద్దాం

- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కళావతిబాయి
- కళాజాతా ప్రారంభం



కళాజాతాను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ నియంత్రణకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని, దీనికోసం సమాజంలో ప్రతీ ఒక్కరూ దీనిపై అవగాహన కల్పించుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.కళావతీబాయి అన్నారు. సోమవారం జిల్లాలో ఐఈసీ కళాజాతా ప్రోగ్రాంను నగరంలోని పాత బస్టాండు వద్ద సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పదిరోజుల పాటు ఈ కళాజాత ప్రోగ్రాంలు జిల్లాలో పలు నగరాలు, గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాను హెచ్ఐవీ రహిత జిల్లాగా నిలిపేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.హెచ్ఐవీపై పూర్తి అవగాహన కల్పించుకోవాలని,సోకకుండా చూసుకోవాలని కోరారు.హెచ్ఐవీ సోకిన వారిపై వివక్ష చూపవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాఎయిడ్స్ నివారణ, నియంత్రణ అధికారి డాక్టర్ పి.వెంకటరమణ, యూనిట్ సభ్యులు నాగయ్య,మహమ్మద్ అలీ,రామకృష్ణ, వీరయ్య, జాగృతి స్వచ్ఛందసేవ సంస్థ సిబ్బంది, అప్స్వాప్లస్ సిబ్బంది పాల్గొన్నారు.

20 వరకు అర్బన్ ఆరోగ్య కేంద్రం పూర్తి కావాలి

ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): కైకోండాయిగూడెం వద్ద నిర్మాణం జరుగుతున్న అర్బన్ ఆరోగ్య కేంద్రం భవనం పనులు ఈనెల 20వరకు పూర్తి కావాలని కమిషనర్ ఆదేశించారు. ఏసీఎల్‌పీ శ్రీజతో కలిసి కమిషనర్ సోమవారం నగరంలో పర్యటించారు. అర్బన్ ఆరోగ్య కేంద్రంతో పాటుగా అల్లూరి సీతారామారాజు కాలేజీ, జిల్లా సైన్స్ మ్యూజియం తనిఖీలు చేశారు. ఉద్యోగుల హాజరు రికార్డులను పరిశీలించారు. భవనాలు మరమత్తులు, కావాల్సిన పరికరాలు ఏర్పాటుపై సంబంధిత అధికారులతో మాట్లాడారు.

ఇందిరమ్మరాజ్యంలో అన్నిరంగాల అభివృద్ధి

- విద్య,వైద్యం, వ్యవసాయంలో రాజీపడేది లేదు
- రూ.3కోట్లతో వీవీపాలెంలో బీసీ బాలుర వసతిగృహం..
- సీఎంతో మాట్లాడి 200 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



బీసీబాలుర వసతిగృహానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం,సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందని,రాష్ట్రంలోనే మోడల్‌గా వీ.వెంకటాయపాలేంలో రూ.3కోట్లతో బీసీ బాలుర వసతి గృహం భవనాలు నిర్మాణం చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెంలో బీసీ బాలుర వసతిగృహంతో పాటుగా రూ.30లక్షలతో పశువుల వైద్యశాల భవనాలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఖమ్మంమార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు స్థానిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీవీపాలేం నుంచి జగ్యాతండాకు రూ.1కోటితో రహదారి, డ్రెయినేలకు హామీ ఇచ్చారు. 200 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రితో మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు మంజూరు చేయిస్తామని తుమ్మల హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రఘునాథపాలెం మండలం ఖమ్మం అర్బన్‌లో కలిసి ఉందని, రైతులు ఆధునిక వ్యవసాయంపై తెలుసుకొని లాభసాటి వ్యవసాయం చేయాలని సూచించారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతీ తండాకు సాగర్ జలాలు అందుబాటులోకి వచ్చాయని, రైతులు పామాయిల్ సాగు చేసి అధిక ఆదాయం పొందాలని సూచించారు. రాష్ట్రంలోనే అభివృద్ధిలో ఆదర్శవంతమైన మండలంగా రఘునాథపాలెం అభివృద్ధి జరుగుతుందని పనుల నాణ్యతలో రాజీపడోద్దని అధికారులను ఆదేశించారు. వీవీపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిశోర్, మాజీ సర్పంచి కాపా ఆదినారాయణ, గ్రామశాఖ అధ్యక్షుడు బానోత్ కిషోర్, కిలారి వెంకటరమణ, కూతుంబాక రాము, కిలారి అనిల్, మూడ్ శంకర్, ధరావత్ వీరు, కుతుంబాక సీతారామ్, అనంగుల పాపారావు, ఉయ్యాల వెంకటనర్సయ్య, ఆవుల జానకీరాములు, తగరం నాగరాజు, తగరం ఆదామ్, బలగాని రామలింగం, పరుశూరి శ్రీనివాసరావు, వర్థబోయిన వెంకట్రావు, మూడ్ వెంకన్న, మాలోత్ రమేశ్, పంకు కిషోర్ పాల్గొన్నారు.

రైతులు వారి సొసైటీల పరిధిలోనే కూపన్లు తీసుకోవాలి

నేలకొండపల్లి, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కూపన్ల కోసం రైతువేదిక వద్దకు రావద్దని, ఏ సొసైటీకి సంబంధించిన రైతులు ఆ సొసైటీ పరిధిలో మాత్రమే యూరియా కూపన్లు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.రాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమకు సంబంధం లేని సొసైటీల పరిధిలోకి వెళ్లి అడిగితే యూరియా కూపన్లు ఇవ్వరనే విషయాన్ని రైతులు గమనించాలని ఎంఏఓ ప్రకటనలో తెలిపారు. యూరియా పంపిణీకి ముందు రోజు ఆయా గ్రామాల్లో వ్యవసాయాధికారులు, పంచాయతీ అధికారులు ముందస్తుగా రైతులకు సమాచారం ఇస్తారన్నారు. కూపన్లు ఎప్పుడిస్తారో కూడా అధికారులు ముందుగానే రైతులకు సమాచారం ఇస్తారని ఏఓ రాధ ప్రకటనలో తెలిపారు. రైతులు కూపన్లు తీసుకోవటానికి వచ్చే సమయంలో పట్టాదారు పాస్ బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను ఖచ్చితంగా వెంట తెచ్చుకోవాలని లేని పక్షంలో కూపన్ ఇవ్వబడదని ఏఓ స్పష్టం చేశారు. యూరియా కూపన్ల పంపిణీలో అధికారులకు సహకరించాలని, ప్రతీ రైతుకు యూరియా అందిస్తామని మండల వ్యవసాయాధికారి ప్రకటనలో తెలిపారు.

పింఛన్లు పెంచాలని ధర్నా

ఖమ్మంచర్చికాంపౌండ్, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పెన్షన్‌దారుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. వికలాంగుల పింఛన్ రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడి కార్మికులతో పాటు ఇతర పింఛన్‌దారులకు రూ.4వేలు పింఛన్ వెంటనే ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు కావస్తున్నా పింఛన్లు పెంచడంలో విఫలమైందన్నారు ఈకార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు సామినేని భవాని చౌదరి, ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

వినతులు ఆలకించి.. పరిష్కారానికి ఆదేశించి..

- ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న శ్రీనివాసరెడ్డి

ఖమ్మంకలెక్టరేట్,సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 100కు పైగా దరఖాస్తులు అందాయి. జిల్లా నలుమూలల నుంచి బాధితులు కలెక్టరేట్‌కు వచ్చి తమ అర్జీలను అధికారులకు అందించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిశీలించి పరిష్కారానికి ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను ఆయాశాఖల అధికారులు పెండింగ్‌లో లేకుండా చూడాలని సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజలు తమ దరఖాస్తులను అందించారు. దాదాపు 40కి పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, కలెక్టరేట్ ఏఓ కారుమంచి శ్రీనివాస్, డీపీవో ఆశాలత, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.కళావతిబాయి, సివిల్‌సప్లై డీఎం శ్రీలత, ల్యాండ్‌సర్వే ఏడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని ఇలా :

- తూటికుంట్ల గ్రామరైతులు అమరావతికి వెళ్లే రోడ్డు నిర్మాణంలో 61,64 సర్వే నెంబర్ వద్ద కొత్త బంధం చెక్ డ్యాం వరద నీళ్లు వెళ్లేందుకు ఒక్క కానా మాత్రమే నిర్మిస్తున్నారని, అది సరిపోవడం లేదని, మరొక కానాతో బ్రిడ్జి నిర్మాణం చేయాలని రైతులు కోరారు.
- ఖమ్మంరూరల్ మండలం తల్లంపాడు కు చెందిన రామిరెడ్డి లక్ష్మారెడ్డి తన కుమారుడు సునిల్‌రెడ్డి మరోమహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశారు.
- పెనుబల్లి మండలం మర్లకుంట గ్రామానికి చెందిన జొన్నలగడ్డ హారిక, తనకు ఎస్సీ గురుకుల పాఠశాలలో 8వ తరగతి సీటు ఇప్పించాలని దరఖాస్తు చేసుకుంది.
- ఖమ్మం నగరానికి చెందిన ఎం. సుశీల, తనకు సొంత ఇల్లు లేదని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లేదా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని దరఖాస్తు చేశారు.

ప్రజాఫిర్యాదులను పరిష్కరించాలి

- కేఎంసీలో వినతులు స్వీకరించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు అందించే ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. సోమవారం కేఎంసీలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. సంబంధిత విభాగాల అధికారులకు ఆదేశాలిచ్చారు. మహిళా శక్తి క్యాంటిన్ కావాలని, స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఇలా మొత్తం 38 వినతులు అందాయి. కాగా కేఎంసీలోని కంప్లేట్ బాక్స్‌ను కమిషనర్ ఓపెన్ చేయించారు. రహదారులపై తిరుగుతున్న పశువులను, ఖమ్మం నగరంలోని కోతలు, కుక్కల బెడదను నియంత్రించాలని, పాత బస్టాండ్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఆరు వినతులు వెలువడ్డాయి. అలాగే బల్లేపల్లి, పాతమున్సిపల్ కార్యాలయాల్లోని జోనల్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ఏఎంసీ అనిల్, ఈఈ కృష్ణలాల్, పట్టణ ప్రణాళికఅధికారి గంధం వసుంధర, ఏవో శ్రీనివాసరెడ్డి, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీసీపీ ప్రసాదరావు

పోక్సో కేసుల్లో నేరస్తులు తప్పించుకునే అవకాశం లేదు

అడిషనల్ డీసీపీ ప్రసాదరావు

ఖమ్మంక్రైం, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసుల్లో నేరస్తులు తప్పించుకునే అవకాశం లేదని అడిషనల్ డీసీపీ ప్రసాదరావు అన్నారు. సోమవారం ఉమెన్ సేఫ్టీవింగ్ ఆధ్వర్యంలో భరోసా కన్వెర్జెన్సీ సమావేశం పోలీసు కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మొదటి అదనపు జిల్లా జడ్జి కె.ఉమాదేవి హాజరయ్యారు. బాధితులకు భరోసా నష్టపరిహారం, పునరావాసం తదితర అంశాలపై సూచనలు చేశారు.ఈసందర్భంగా ఏడీసీపీ మాట్లాడుతూ 18ఏళ్లలోపు పిల్లలపై లైంగిక వేధింపులు అరికట్టడానికి బలమైన చట్టంఆ పోక్సో యాక్టు రూపొందించబడిందన్నారు. ఈచట్టం కింద బాధితుల మరియు నిందితుల మధ్య రాజీపడే అవకాశం లేదన్నారు. బాధితులు నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. ఈసమావేశంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఎస్పీ శ్రీధర్, డీసీపీవో విష్ణువందన, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ భారతీరాణి పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం1 ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలను మంగళవారం ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈవివరాలను స్టేషన్ హౌజ్ ఆఫీసర్ కృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలా ఉన్న వాహనాలను ఆదే కండిషన్‌తో అమ్మకాలు జరుపుతున్నామని, వేలంలో పాల్గొనే వారు సమయానికి ముందుగా దరఖాస్తు రుసుం చెల్లించాలని తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష



హాజరైన రాజకీయ నేతలు

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్నిరాజకీయ పార్టీలు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ కోరారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు.ఎన్నికలకు ఎంపీటీసీ వారీగా ఓటర్ల ఫోటోతో కూడిన ముసాయిదా జాబితాను మండలపరిషత్, జడ్పీకార్యాలయంలో ఈనెల6న అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ జాబితా ఆధారంగా ఎంపీటీసీ పరిధిలో ఓటర్ల జాబితాను సిద్ధం చేసినట్లు తెలిపారు. పైఏమైనా అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అభ్యంతరాలను ఈనెల10న పరిష్కరించి, సెప్టెంబరు 10న తుదిజాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయపార్టీల ప్రతినిధులు గుబ్బగుర్తి, యల్లన్న నగర్‌లో కొత్తపోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.ఈ ప్రాంతం లో గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ భవనం లేదని, పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు అనువైన భవనం లేదని శ్రీజ రాజకీయపార్టీల ప్రతినిధులకు వివరించారు. దీంతో ఓటర్ల రవాణా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఈసమావేశంలో జడ్పీసీఈఓ దీక్షరైనా, వివిధ పార్టీల ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

17 నుంచి 'స్వస్త్‌నారీ', 'సశక్త్ పరివార్'

- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్,సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): స్వస్త్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి కోరారు. కలెక్టరేట్‌లో ఆయన స్వస్త్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంపై సోమవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో, జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రతీ రోజు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యా, సంక్షేమశాఖ, ఇంటర్మీడియట్ అధికారుల సహకారంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లోని బాలికలందరికీస్పెషల్ క్యాంప్ ఏర్పాటు చేసి వైద్యుల ద్వారా అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మశ్రీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కళావతిబాయి,డీఐవో డాక్టర్ చందూనాయక్, వైద్య, ఆరోగ్య శాఖ వివిధ విభాగాల అధికారులు, కలెక్టరేట్ ఏఓ కారుమంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

తిరుమలాయపాలెం, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం పిండిప్రోలులో పసలాది వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నాయన్నారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతుందన్నారు. ఈసమావేశంలో ఆర్.శివలింగం,తిమ్మిడి హనుమంతరావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి. వెంకటస్వామి, సత్యం, వెంకన్న, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చోడుతండా కార్యదర్శిపై అధికారులకు ఫిర్యాదు

తిరుమలాయపాలెం, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బచ్చోడుతండా గ్రామకార్యదర్శి గంజి విద్యాసాగర్‌పై సోమవారం ప్రజావాణిలో డీపీవోకు వినతి పత్రం అందించారు. బచ్చోడుతండాకు చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు గుగులోత్ సురేష్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యదర్శి విధులకు సక్రమంగా రాకుండా ఉన్నాడని, మద్యం సేవించి విధులకు హాజరవుతున్నాడని తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో వర్కర్లను వేధింపులకు గురిచేస్తున్నాడని వినతిలో వివరించారు. కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలన్నారు. వినతి అందించిన వారిలో వెంకన్న, రెడ్యా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.10వేల సహాయం

రఘునాథపాలెం, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చిరాం తండా మాజీ సర్పంచి భచీచంద్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. బాధిత కుటుంబాన్ని సోమవారం మాజీ వైస్‌ఎంపీపీ గుత్తా రవి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరిప్రసాద్, పిన్ని కోటేశ్వరరావు, నున్నా శ్రీనివాసరావు, ఆత్మమాజీ కమిటీ చైర్మన్ లక్ష్మణ్‌నాయక్, మాజీ ఎంపీటీసీ జానా, చిన్న నర్సింహారావు పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేలు అందించారు. రవికిరణ్, వెంకటేశ్వర్లు, రాంబాబు, కృష్ణ,నాగేశ్వరరావు, బాల, దేవా, కిషన్, శ్రీకాంత్, తారా చంద్ పాల్గొన్నారు.



ఎన్నికలకు అన్ని పక్షాలు సహకరించాలి

- నేలకొండపల్లి ఎంపీడీఓ ఎర్రయ్య
- మండల ఓటర్లు 49533...
- పోలింగ్ స్టేషన్లు 95, ఎంపీటీసీలు 18



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎర్రయ్య

నేలకొండపల్లి, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా అన్ని రాజకీయ పక్షాలు పూర్తిగా సహకరించాలని ఎంపీడీఓ మర్రి ఎర్రయ్య రాజకీయ పార్టీలను కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తి శాంతియుతంగా జరిగేలా సహకరించాలన్నారు. మండలంలో మొత్తం 49533 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 23691 మంది పురుషులు, 25842మంది మహిళా ఓటర్లన్నారు. 18ఎంపీటీసీ స్థానాలున్నాయని, 95 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని ఎర్రయ్య చెప్పారు. అన్ని పార్టీలు ఎన్నికల నియమావళిని పూర్తిగా పాటించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, టీడీపి మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆరెకట్ల కొండలరావు, నలమాస మల్లయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, షేక్. హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు బచ్చలకూరి నాగరాజు, మామిడి వెంకన్న పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణకు అన్ని రాజకీయపార్టీలు సహకరించాలని ఎంపీడీవో సిలార్‌సాహెబ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అఖిలపక్షపార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. మండలంలో 18 ఎంపీటీసీల ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఓటర్లజాబితాలో ఎటువంటి అవకతవకలున్నా అధికారులు దృష్టికి తేవాలని కోరారు. మండలంలో 50,571మంది ఓటర్లు ఉన్నారని వీటికోసం 100పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులు తిమ్మిడి హనుంతరావు,రాజేంద్రప్రసాద్, కొమ్ము శ్రీను, జి.అశోక్, కె.బాలాజీరావు,వెన్నబోయిన రమేష్, యూడీసీ ఎస్‌కే మీరా పాల్గొన్నారు.



యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

» జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజ్

మధిర రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజ్ విమర్శించారు. సోమవారం మధిరలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన ముఖ్యనేతలు, కార్యకర్తలు, సోషల్‌మీడియా సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుసంఘ సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. యూరియా దొరక్కా రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. రైతుల పక్షాన అండగా ఉండి పోరాడతామన్నారు. నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, చావా వేణు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, అప్పారావు, శ్రీనివాసరావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, నరేందర్‌రెడ్డి, పరిశా శ్రీను పాల్గొన్నారు.

తరుణం మించిపోకముందే యూరియా అందించాలి

వైరా: వరినాట్లు వేసి 50నుంచి 60రోజులవుతుందని, తరుణం మించిపోతుందని, యూరియా లేకపోతే పైరుకు నష్టం వాటిల్లి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తరుణం మించిపోతున్నందున వెంటనే యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వైరాలోని మండల వ్యవసాయశాఖ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు నిరసన తెలిపిన రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల అవసరాలకు సరిపడా యూరియా సరఫరా జరుగుతుందని ప్రతిరోజూ మంత్రులు, అధికారుల ప్రకటనలు చూసి రైతులు తెల్లవారుజాము నుంచే సొసైటీ గోదాముల ముందు పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. వారానికోసారి కూడా యూరియా సరఫరా జరగడం లేదని దాంతో రైతులు వ్యవసాయ పనులు మానేసి ఆ ఎరువు కోసం పడిగాపులు కాస్తున్నారని, వెంటనే యూరియా సరఫరా పెంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారి మయాన్ మంజూఖాన్‌కు ఒక వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం నాయకులు సుంకర సుధాకర్, మల్లెంపాటి రామారావు, పైడిపల్లి సాంబశివరావు, కామినేని రవి, చిత్తారు మురళీ, యనమద్ది రామకృష్ణ, నారికొండ అమరేంద్ర పాల్గొన్నారు.

యూరియా గోదాము పరిశీలన

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ, చింతకాని సొసైటీ కేంద్రాలను సోమవారం మధిర ఏడీఏ విజయచంద్ర పరిశీలించారు. గోదాములో యూరియా నిల్వలు, రికార్డులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు సరిపడా యూరియా మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఏవో మానస, ఏఈవోలు రజిత,తేజ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ లక్ష్మీభార్గవి

మధిర రూరల్: ఆంధ్రా-తెలంగాణ సరిహద్దులో ఉన్న మధిర మండలం నుంచి ఎవరైనా యూరియాను బయటకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందనది మధిర రూరల్ ఎస్ఐ హెచ్చరించారు. సోమవారం మధిర మండలం దెందుకూరు సహకార సంఘంలోని ఎరువుల గోదామును ఆమె సందర్శించారు. యూరియా అమ్మకాలను పరిశీలించారు. రైతులందరూ క్యూపద్ధతిని పాటించి సొసైటీ వారికి సహకరించాలని ఆమె సూచించారు.

కారేపల్లి: రైతులకు ప్రభుత్వం సరిపడా యూరియాను సరఫరాచేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్ ఏ.రమేష్‌కు వినతిపత్రం అందించారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆసంఘం రాష్ట్ర నాయకుడు గుగులోత్ తేజనాయక్ మాట్లాడారు. సంఘం మండల అధ్యక్షుడు గుమ్మడి సందీప్, నాయకుల వడ్డే వెంకటేశ్వర్లు, పుల్లకాని సత్తిరెడ్డి, పాపారావు పాల్గొన్నారు.



వైరా వ్యవసాయ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు



మధిర సొసైటీని సందర్శించిన రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి



సమావేశంలో మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజ్

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కల్లూరు, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి) భవన నిర్మాణ రంగ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచడం పట్ల హర్షం వ్యకం చేస్తూ కల్లూరులో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తాపీ వర్కర్స్ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె ఉస్మాన్, తురాబ్‌అలీల ఆధ్వర్యంలో తాపీ వర్కర్స్ మిఠాయిలు పంపిణీ చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. సీఎంతోపాటుగా కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి చిత్రపటాలకు కూడా వారు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో తాపీ వర్కర్స్ సంఘం నాయకులు వేల్పుల రవి, ఉపాధ్యక్షుడు మల్లాది బసవయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె మహబూబ్‌అలీ, కోశాధికారి రాందాస్, మల్లికార్జున్, ఆశీర్వాదం, గౌరవ సలహాదారులు ఎస్‌కె జానీ, ఎం పిచ్చిరెడ్డి, బాలస్వామి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

ముదిగొండ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ నుంచి వెంకటగిరి క్రాస్‌రోడ్డు వరకు మోకాలులోతు గుంతలు పడి అధ్వానంగా ఉన్న రోడ్డు నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఐదుకిలోమీటర్లు మహాపాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం పట్టణానికి కూత వేటు దూరంలో ముదిగొండ రోడ్డు అభివృద్ధి జరగకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ముగ్గురు మంత్రులు ప్రాతినిథ్యం వహిస్తున్నా ఈ రోడ్డును మంత్రులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ ప్రధాన రహదారిని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ రహదారి సమస్యపై సీపీఎం పలు కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. వెంటనే గోతులకు మరమ్మతులకు కాకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రకు బీఆర్ఎస్, సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. సీపీఎం జిల్లా నాయకులు బండి రమేష్, బండి పద్మ, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు దామోదర్, టీఎస్.కల్యాణ్, భద్రయ్య, బట్టు రాజు, ఇరుకు నాగేశ్వరరావు, కోలేటి అరుణ, ఉపేందర్, పద్మ, వెంకయ్య, దస్తగిరి, లక్ష్మణ్, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు బంకా మల్లయ్య, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

'సెమిస్టర్'లో మదర్‌థెరిస్సా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 2024-25విద్యా సంవత్సరంలో గత జూన్ నెలలో జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్ 3వ సంవత్సరం 2వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల వివరాలను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డా.చలసాని హరికృష్ణ తెలిపారు. ఈఈఈలో కల్లేపల్లి గౌతమి, చెక్కర్రం సింహాద్రి, కొమరవరపు మారేష్, ఈసీఈలో బొట్టు తేజస్వి, షేక్ ఇస్రాత్ ఆరా, మహ్మద్ అమీరా అంజూమ్, మొగిలిపువ్వు మహిత, శీలం పావని, సీఎస్‌ఈలో పసుపులేటి నాగజ్యోతి, గాండ్ల హిందుశ్రీ, పెద్దిని ధనలక్ష్మీ, రావుల అరుందతి, ఏఐఅండ్ ఎంఎల్‌లో దాసరి దేవకీ, దూబా సూర్యప్రకాష్, నున్నా సుజాత, పిట్టల ఉషా, పోట్రు మౌనిక, మైనింగ్ ఇంజనీరింగ్‌లో ఆదెర్ల లోకేష్, జక్కుల అన్వేష్, రాచమళ్ల సాయిశివసుందరరావులను ప్రత్యేకంగా అభినందించారు. సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డా.ఎంవీ.రామచంద్రరావుతో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సుంకం రద్దుతో రైతులకు ఉరి బిగిస్తున్న కేంద్రం

కొణిజర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుబడిపై 11శాతం సుంకాన్ని రద్దుచేసి దేశ రైతులకు ఉరి బిగిస్తోందని అఖిల భారత ఐక్య రైతుసంఘం ఖమ్మంజిల్లా కార్యదర్శి కొల్లేటి నాగేశ్వరరావు విమర్శించారు. ఖమ్మం కేంద్రంలో రేపు జరిగే రైతు సదస్సును జయప్రదం చేయాలి కోరుతూ సోమవారం మండలంలోని గుబ్బగుర్తి గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామ్రాజ్యవాద కంపెనీల వత్తిడికి, భారతదేశం టెక్స్‌టైల్స్ కంపెనీల ప్రయోజనం కోసం 60లక్షల మంది పత్తి రైతులను పణంగా పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో రైతులు యూరియా కష్టాలను కేంద్రం పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. రేపు జాతీయస్థాయిలో జరిగే రైతు సదస్సుకు రైతులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. నాయకులు పాశం అప్పారావు, చింతల వెంకటేశ్వర్లు, మేడికొండలు, సీతారాములు, కృష్ణ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలపై అఖిలపక్ష సమావేశం

కల్లూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ముసాయిదా ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితాల తయారుపై అఖిల పక్ష రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థలైన ఎంపీటీసీ, జడ్పీటీసీల వారిగా ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితాల తయారు చేయాలని ప్రభుత్వ అధికారులను ఆదేశించడం జరిగింది. ఆ క్రమంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సమక్షంలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మండలంలో 13 ఎంపీటీసీలకు గాను 35,553 ఓటర్లు ఉన్నారని చెప్పారు. వార్డుల వారిగా జాబితాలను తయారు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, బీజేపీ, టీడీపీ పార్టీల నాయకులు ఎఎంసీ చైర్మన్ భాగం ప్రభాకర్ చౌదరి, కాకర్ల రంగారావు, నరసింహారావు పాల్గొన్నారు.

అనర్హులకు ఇళ్లు.. కలెక్టర్‌కు ఫిర్యాదు

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో అనర్హులకు ఇళ్లు కేటాయించారని సోమవారం సీపీఎం నాయకులు జొన్నలగడ్డ సునిత, కారంగుల చంద్రయ్యలు కలెక్టర్‌అనుదీప్ దురిశెట్టికి ఫిర్యాదు చేశారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్‌కు చెందిన వారికే ఇళ్లు ఇచ్చారని, తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామసభ నిర్వహించి అర్హులను పరిగణనలోకి తీసుకుంటామని కలెక్టర్ హామి ఇచ్చినట్లు తెలిపారు.

మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్ట్

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడిలో భాగంగా పట్టణానికి చెందిన మాల మహానాడు నాయకులను సత్తుపల్లి పోలీసులు సోమవారం తెల్లవారుజామున ముందస్తు అరెస్టులు చేశారు. రాష్ట్రవ్యాప్త ఎమ్మెల్యే కార్యాలయాల ముట్టడి సందర్భంగా అరెస్ట్ చేయడాన్ని సత్తుపల్లి మాల మహానాడు నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు. మాలలకు రావాల్సిన వాటా వచ్చేవరకు ఈ పోరాటం కొనసాగిస్తామని, భవిష్యత్తులో ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని పిలుపునిచ్చారు. అరెస్టైన వారిలో పిల్లి కవితామల్లిక్, కోపల్లి రత్తయ్య, కరిపెడ సుదర్శనం ఉన్నారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేయవద్దు

వైరా, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దని వైరా ఎస్ఐ పుష్పాల రామారావు హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి సోమవారం వైరా పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురైతే జరిగే నష్టాల గురించి ఆలోచించాలని హితవు పలికారు. ఏదైనా జరిగితే మీ కుటుంబం నష్టపోయి చిన్నాభిన్నమవుతుందని అందువల్ల మద్యం తాగిన సమయంలో డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని హితవు పలికారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిని జరిమానా చెల్లించేవిధంగా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకొనేందుకు మధిర పంపించారు.

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల అందజేత

పెనుబల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హోప్ గ్లోబల్, సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, వీజీఎఫ్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులకు ఖమ్మం సీఎంవో ప్రవీణ్‌కుమార్ ల్యాప్‌టాప్‌లు అందజేశారు. సోమవారం వీఎంబంజర్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పెనుబల్లి, వేంసూరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్, సైన్స్ ల్యాబ్ మెటీరియల్, 15మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఎంపీడీవో అన్నపూర్ణ, పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యూసఫ్, వీజీఎఫ్ ట్రస్టు డైరెక్టర్లు బెల్లంకొండ శ్రీనివాసరావు, బాజినేని నర్సింహారావు, భద్రకాళి, రజిని, రాంబాబు, పెనుబల్లి, వేంసూరు మండలాల ప్రధానోపాధ్యాయులు, వీఎంబంజర్ హైస్కూల్ హెచ్‌ఎం ఈవీ.రామారావు పాల్గొన్నారు.

వనమహోత్సవంలో భాగస్వాములవ్వాలి

సత్తుపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. స్థానిక గాంధీనగర్‌లో సోమవారం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. భవిష్యత్తులో మన పిల్లలకు పచ్చదనం పంచేందుకు, కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించేందుకు విధిగా మనమంతా మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ కే.నరసింహా, కాంగ్రెస్ నాయకులు గాదె చెన్నారావు, ఎండీ.కమల్‌పాషాతో పాటు మునిసిపల్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చలో ప్రజాభవన్‌ను జయప్రదం చేయండి: జేఏసీ

సత్తుపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న తలపెట్టిన ఛలో ప్రజాభవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పీఎస్‌సీడబ్ల్యూయూ కొత్తగూడెం రీజియన్ అధ్యక్షుడు అమర్లపూడి శరత్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. కార్మికుల శ్రమతో వచ్చిన లాభాలలో వాటాగా రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక్క పర్మినెంట్ కార్మికుడికి ఇచ్చే జీతంతో 10మంది కాంట్రాక్టు కార్మికులతో పనిచేయించుకుంటూ సంస్థ లాభాలు గడిస్తోందని, 12ఏళ్లుగా వేతనాలు కూడా పెంచలేదని అన్నారు.

మెరుగైన ఫలితాల సాధన కోసం కృషి చేయాలి

బోనకల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెరుగైన ఫలితాల సాధన కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆర్‌సీవో సీహెచ్ రాంబాబు కోరారు. స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. తరగతి గదులలో విద్యా బోధనతోపాటు సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు ఉపాధ్యాయులు కష్టపడి పని చేయాలన్నారు. అత్యంత ప్రతిభ చాటే విద్యార్థులతో పాటు వెనుకబడిన వారిని గుర్తించి వారి కోసం చేపట్టాల్సిన కార్యచరణను పకడ్బందీగా రూపొందించుకోవాలని సూచించారు. అందరూ సమన్వయంతో పని చేసి గురుకులానికి మంచి పేరు తీసుక రావాలని కోరారు. ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ నుంచి నష్టపరిహారం ఇప్పించాలి

తల్లాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ ఉద్యోగుల నిర్లక్ష్యం వల్ల జరిగిన పంటనష్టానికి పరిహారం ఇప్పించి ఆదుకోవాలని మండలంలోని ముద్దనూరు గ్రామానికి చెందిన రైతు ఇమ్మడి హరికృష్ణ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని తన రెండు ఎకరాల విస్తీర్ణంలో ఆదివారం మిర్చి మొక్కలు నాటినట్టు తెలిపాడు ఈనెల 6వతేదీన విద్యుత్ శాఖ లైన్‌మెన్ కాంట్రాక్టు సిబ్బందితో కలిసి ఒకే జంపర్‌కు రెండు వైర్లు కలపడంతో తన వ్యవసాయవిద్యుత్ మోటారు కాలిపోయిందని తెలిపాడు. విద్యుత్ మోటారు కాలిపోవడంతో మిర్చి మొక్కలకు సాగునీరు అందక ఎండిపోయి నష్టం వాటిల్లిందని తెలిపారు విచారణ జరిపి విద్యుత్‌శాఖ ఉద్యోగులపై చర్యలు తీసుకుని నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

కార్మికుల శ్రమదోపిడీ చేస్తున్న ప్రభుత్వం

ఎర్రుపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులకు వారాంతపు సెలవు కూడా లేకుండా వారి శ్రమను దోపిడి చేస్తూవేతనాలను అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం గారడీ చేస్తోందని ఆ సంఘం మండిపడింది. సోమవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి మండలపరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో సురేందర్‌కు, ఎంపీవో గంధం శ్రీలక్ష్మికి వినతిపత్రం అందించారు ఈసందర్భగా సీఐటీయూ నాయకులు షేక్ హస్సేన్, మద్దాల ప్రభాకరావులు మాట్లాడారు. సంజీవరావు, వెంకటేవ్వర్లు, వెంకటరామయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

ఏన్కూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బురదరాఘవాపురం ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అక్షరాస్యత ఆవశ్యకతను తెలియచేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం నాగిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో అందరు అక్షరాస్యతను సాధించలాని ఇల్లాలు చదివినట్టయితే ఇంటిల్లిపాదికి ఉపయోగిం ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు సాగి సుజాత, రామారావు, బావ్‌సింగ్ పాల్గొన్నారు.

అంగవైకల్యానికి ఫిజియోథెరఫీ..

పెనుబల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఎన్నోరకాల వైకల్యాలకు గురవుతున్నారని వారికి ఫిజియోథెరపీ ఎంతో అవసరమని ఫిజియోథెరపిస్టు మాగంటి ప్రభాకర్ రావు అన్నారు. సోమవారం పెనుబల్లి భవితా కేంద్రంలో ఫిజియోథెరపి దినోత్సవాన్ని నిర్వహించారు. భవితా కేంద్రంలో 0-18సంవత్సరాల వయస్సు గల దివ్యాంగ పిల్లలందరికి ఉచితంగా శిబిరం జరుగుతుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పిల్లలకు తినిపించారు. ఐఈఆర్‌పీలు మంజుల, కోట ప్రజ్ఞా, ఐఎంఎస్ కోఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయడి మృతి

చింతకాని, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నమండవ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శెట్టిపల్లి పాండు రంగారావు (72) సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతదేహాన్ని బీఆర్ఎస్ నాయకులు, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెంట్యాల పుల్లయ్య, గురిజాల హనుమంతరావు, మంకెన రమేష్, బొడ్డు వెంకటరామారావు, పర్చగాని తిరుపతి కిషోర్, పర్చగాని ఏడుకొండలుపాల్గొన్నారు.

'స్థానిక' సెగ..బోనకల్‌లో బీఆర్ఎస్‌కు షాక్

» అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతోనే భారీగా చేరికలు: భట్టి



భట్టి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

బోనకల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో స్థానిక ఎన్నికల సెగ రాజకీయ పార్టీలను అతలాకుతలం చేస్తుంది. మండల కేంద్రమైన బోనకల్‌లో బీఆర్ఎస్ పార్టీకి బారీ గండి పడింది. బోనకల్ సొసైటీ చైర్మన్ చావా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ పోటు వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ బీసీసెల్ మండల అధ్యక్షుడు మోర్ల మహేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ మందా హైమావతి, మాజీ ఎంపీటీసీ మందా హైమావతి, మోర్ల శ్రీను, తెలుకులపల్లి సాంబయ్య, రావుట్ల హరిలతో పాటు 70 కుటుంబాల వారు సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతోనే కాంగ్రెస్ పార్టీలోకి ప్రజా ప్రతినిధులు, ప్రజలు వస్తున్నారని తెలిపారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా మారుతుందన్నారు. బోనకల్ గ్రామంలో పట్టున్న నేతలు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పడంతో కాంగ్రెస్ పార్టీలో స్థానిక పోరు ముందుగానే జోష్ నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీసీసీ కార్యదర్శి పైడిపల్లి కిషోర్ కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, బంధం శ్రీనివాసరావు, మోదుగు సుదీర్‌బాబు, భూక్యా సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మధు మృతికి ఆర్యవైశ్య సంఘ నాయకుల నివాళులు

బోనకల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన ఐటీసీ సిగరెట్ కంపెనీ డీలర్ చవట మధు అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని ఆర్యవైశ్య సంఘ నాయకులు చేదే వెంకటేశ్వరరావు, చెన్నా సుదీర్, గుర్రం పూర్ణచందర్‌రావు, వెంకట గోపాలరావు, గుర్రం వెంకటేశ్వరరావు, సంపత్ కుమార్, వెంకటేశ్వర్లు, బాను, రంగా జనార్ధన్, శ్రీనివాసరావులు సందర్శించి నివాళులర్పించారు.

ఒకే పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు

ఏన్కూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒకే పాఠశాలనుంచి 4గురు ఉపాధ్యాయులు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందడం విశేషం. ఏన్కూరు జిల్లాపరిషత్ బాలికల, ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు బి.లక్ష్మ, మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించినందుకు అవార్డును అందుకున్నారు. అదేవిధంగా ఫిజిక్స్ సబ్జెక్టుగలో సీహెచ్ చంద్రిక, గణితలో సుబాషిణి, బయాలాజికల్ సైన్సులో పి.నిర్మలలు డీఈవో చేతులమీదుగా అవార్డు పొందారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డునుపొందిన ఉపాధ్యాయులకు సోమవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఉపాధ్యాయులు చంద్రిక ,సిబాషిణి, చైతన్యభారతి, నరసింహారావు, పీఈటీ నరసయ్య పాల్గొన్నారు.

ఎంఈవోకు ఘన సన్మానం


మధిర రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ఎంపికైన మధిర ఎంఈవో వై.ప్రభాకర్‌ను సోమవారం మధిరలో నారాయణ ట్రస్టు ఫౌండేషన్ స్కూల్, ఠాగూర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎంఈవో దంపతులకు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నారాయణ స్కూల్ కరస్పాండెంట్ భోనగిరి నారాయణరావు, ఠాగూర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నిరసన

బోనకల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూటికుంట్ల గ్రామంలో సోమవారం ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ డివిజన్ నాయకుడు రాంనర్సయ్య, మాజీ ఎంపీపీ రమేష్‌లు మాట్లాడారు. పంచాయతీలకు నిధులు విడుదల చేయనందున వీధిలైట్లు, పారిశుధ్య నిర్వహణ చేపట్టలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎంఈవోకు బ్రహ్మకుమారీల సన్మానం

వైరా, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో సోమవారం వైరాలోని మండలపరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని ఉపాధ్యాయుల సమక్షంలో ఎంఈవో వెంకటేశ్వర్లును బ్రహ్మకుమారీల సంస్థకు చెందిన గీత సన్మానించారు. ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీవో సక్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు 90శాతం పూర్తి: కమిషనర్

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రూ.10లక్షల నిధులతో చేపడుతున్న పారిశుధ్య పనులు ఇప్పటికే 90శాతం పూర్తయ్యాయని మునిసిపల్ కమిషనర్ కె.నరసింహా తెలిపారు. సోమవారం పట్టణంలోని 2వ వార్డులో జరుగుతున్న పనులను పరిశీలించి వార్డు ఆఫీసర్‌కు పలు సూచనలు చేశారు. ప్రతివార్డులో 15మంది పారిశుధ్య కార్మికులతో పనులు చేయిస్తున్నామని, దోమలు రాకుండా ఫాగింగ్ చేయించడంతో పాటు మురుగు పోయేలా డ్రైనేజీలలో షిల్ట్ తీయిస్తున్నామని, వరదనీరు పోయేలా కాలువలను శుభ్రం చేయిస్తున్నట్లు చెప్పారు. వర్షపు నీరు పారుదల కోసం భారీ డ్రైనేజీలను జేసీబీ, జోజర్లతో శుభ్రం చేయిస్తున్నామని, క్లోరినేషన్, తడిపొడిచెత్త సేకరణపై స్వయం సహాయక సంఘాలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా మొత్తం 23వార్డులలో 16మంది ఉండగా 14మంది వార్డ్ ఆఫీసర్లు రిలీవ్ అయ్యారని, వారి మాతృశాఖకు వెళ్లగా సన్మానించినట్లు తెలిపారు. ప్రజలు అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.

వైరా ఏఎంసీ చైర్మన్‌గా బోళ్ల గంగారావు

» ప్రభుత్వానికి సిఫార్సు చేసిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



వైరా, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గానికి మోక్షం లభించింది. వైరా మునిసిపాలిటీ నాల్గోవార్డు ద్వారకానగర్‌కు చెందిన బోళ్ల గంగారావు చైర్మన్ కానున్నారు. ఈ మార్కెట్ కమిటీ పాలకవర్గం సిఫార్సుకు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో పాటు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి కూడా ఓకే చేశారు. వైస్‌చైర్మన్ పదవి తల్లాడ మండలంలోని గొల్లగూడెంకు చెందిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్ పేరును సిఫార్సు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 20నెలల నుంచి వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం వైరా, కొణిజర్ల మండలాల్లోని బీసీ సామాజిక వర్గానికి చెందిన అనేకమంది ఆశావాహులు పోటీపడ్డారు. ఈ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీ సామాజిక వర్గానికి రిజర్వు అయింది. వైరా నియోజకవర్గ పరిధిలోని వైరా, కొణిజర్ల మండలాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ల ముద్ర ఈ పాలకవర్గ కమిటీపై ఉన్నట్లు స్పష్టమవుతుంది. అదే సమయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి వర్గాలను కూడా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పరిగణలోకి తీసుకుని కమిటీ పాలకవర్గంలో అవకాశం కల్పించినట్లు ఆయన సిఫార్సు ద్వారా తేటతెల్లమవుతుంది. అలాగే డైరెక్టర్లుగా వైరా మునిసిపాలిటీ పరిధిలోని 16వ వార్డుకు చెందిన జాలాది తిరుపతిరావు(కొణిజర్ల మండలం) అలాగే మండలంలోని ఖానాపురం గ్రామానికి చెందిన షేక్.మౌలాలి, వైరా మునిసిపాలిటీ పరిధిలోని రేచర్ల బజార్‌కు చెందిన రేచర్ల సత్యం, రేచర్ల మహేశ్వరి, ఐదోవార్డుకు చెందిన మోత్కూరి వెంకటేశ్వరరావు అలాగే తల్లాడ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన గొడుగునూరి లక్ష్మీరెడ్డి, కొణిజర్లకు చెందిన కాశిమళ్ల వెంకటేశ్వర్లు, తనికెళ్లకు చెందిన పొట్లపల్లి గోపి, చిన్నమునగాలకు చెందిన పూనాటి బాబూరావు, సోలెబంజర్‌కు చెందిన బాణోతు మురళీకృష్ణ అదేవిధంగా వివిధ వ్యాపార వర్గాల నుంచి వైరాకు చెందిన ఇనుగనూరి వెంకటనాగేశ్వరరావుతోపాటు పాల్వంచలోని కాంట్రాక్టర్ కాలనీకి చెందిన చావా శ్రీనివాసరావును ఎమ్మెల్యే సిఫార్సు చేశారు. ఇప్పటికే ఈ ప్రతిపాదనలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆమోద ముద్ర వేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలోని చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్లకు సంబంధించిన వ్యవసాయ సంబంధ ఇతర వివరాలను మార్కెటింగ్, వ్యవసాయశాఖ అధికారులు సేకరిస్తున్నట్లు సమాచారం. ఆశాఖల నుంచి అన్ని వివరాలతో ప్రభుత్వానికి నివేదిక అందిన వెంటనే పాలకవర్గాన్ని అధికారికంగా ప్రకటించడం మాత్రమే మిగిలి ఉంది.